విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492


www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 230 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఫిబ్రవరి 2025 | వెల : రూ 10/-




## ఢిల్లీ లో భూకంపం

- ఢిల్లీ పరిసరాల్లో స్వల్ప ప్రకంపనలు
- రిక్టర్ స్కేల్ పై భూకంపం తీవ్రత 4.0 గా నమోదు
- అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోడీ హెచ్చరిక

న్యూఢిల్లీ,ప్రజా స్వేచ్ఛ
:దేశ రాజధాని న్యూఢిల్లీతో పాటు పలు పరిసర ప్రాంతాల్లో సోమవారం భూకంపం సంభవించింది. తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ప్రకంపనలు చోటుచేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తెల్లవారుజాము కొద్ది సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో భయాందోళనలకు గురైన ప్రజలు భయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. రిక్టర్ స్కేల్ పై భూకంపం తీవ్రత 4.0 గా నమోదు అయింది. ఢిల్లీతోపాటు నోయిడా, గురుగాం ప్రాంతాల్లో భూప్రకంపనలు

-మిగతా 3 లో



## ఇసుక అక్రమ రవాణా పై
# ఉక్కుపాదం

### దారి మళ్లితే కఠిన చర్యలు తీసుకోండి..

- ఇసుక అక్రమ దందాపై కఠిన చర్యలు
- నిరంతరం ఇసుక రీచ్‌లను తనిఖీ చేయండి
- ఇసుక అక్రమాలపై సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ
ఇసుక అక్రమ రవాణాపై కొరడా ఝుళిపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అక్రమార్కులను వదిలేది లేదని హెచ్చరించారు. అక్రమదందాకు పాల్పడుతున్న వారిని

-మిగతా 3 లో



## కారణజన్ముడు
# కేసీఆర్

### కేసీఆర్ కొడుకుగా పుట్టడం నా అదృష్టం : కేటీఆర్

- తెలంగాణ భవన్ లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు
- యావత్ తెలంగాణ జాతికి హీరో కేసీఆర్
- రాష్ట్రంలో ఎవరిని కదిపినా మళ్లీ కేసీఆర్ రావాలంటున్నారు
- కేసీఆర్ సత్తా ఏంటో చంద్రబాబు, వైస్సార్‌కు తెలుసు
- మధుసూధనా చారి, ఎమ్మెల్యే హరీశ్ రావు,

హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ
కారణజన్ముడు కేసీఆర్ కొడుకుగా పుట్టడం తన పూర్వజన్మ సుకృతమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ కేవలం తనకు మాత్రమే కాదు యావత్ తెలంగాణ జాతికి హీరో అని పేర్కొన్నారు. ఉద్యమం కోసం నడుం బిగించిన నాడు మీడియా లేదు, మద్దతు లేద గుర్తుచేశారు. మీడియా, మనీ, మజిల్ పవర్ లేకుండా తెలంగాణను సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని

-మిగతా 3 లో



## కుల సంఘాలకు హైకోర్టు షాక్

- ఆయా భూముల్లో నిర్మాణాలకు బ్రేక్
- మద్యంతర ఉత్తర్వులు జారీ చేసిన ధర్మాసనం

హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ
కెసిఆర్ హయాంలో వివిధ కులసంఘాలకు కేటాయించిన భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలో కమ్మ, వెలమ, విశ్వబలిజ కాపు సంఘాలకు కేటాయించిన భూముల్లో ఇకపై

-మిగతా 3 లో



## కులగణన కొరివితో తలగోక్కున్న కాంగ్రెస్

- ముస్లింలను తొలగిస్తేనే బీజేపీ ఆమోదిస్తుది
- కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టీకరణ

హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ
కులగణనతో కాంగ్రెస్ కొరివితో తలగొక్కొంటోందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బిల్లు పంపతామంటే ఆమోదించడానికి మేమేమైనా ఎడ్డోళ్లమా? అని ఆయన వ్యాఖ్యానించారు. ముస్లింలను బీసీ జాబితా నుండి తొలగించకుంటే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదని, ముస్లింలను

-మిగతా 3 లో



## ఢిల్లీ బీజేఎల్పీ సమవేశం 19కి వాయిదా

సీఎం ఎంపికలో బీజేపీ మల్లగుల్లాలు

న్యూఢిల్లీ,ప్రజా స్వేచ్ఛ
ఢిల్లీ బీజేపీ శాసనసభాపక్ష సమావేశం వాయిదా పడింది. సోమవారం జరగాల్సిన బీజేఎల్పీ సమావేశాన్ని అధిష్ఠానం ఫిబ్రవరి 19 వతేదీ మంగళవారానికి వాయిదా వేసింది. దీంతో తదుపరి సిఎం ఎవరన్న విషయం మరింత ఆలస్యం కానుంది. 8ననే ఫలితాలు

-మిగతా 3 లో



## రాహుల్ కులం పేరుతో బీజెపీ వ్యర్థ రాజకీయం


- కులగణను పక్కదారి పట్టించే యత్నాలు
- బండి వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి సీతక్క

హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ
లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యల పట్ల మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన సంక్షేమ ఫలాలు, రిజర్వేషన్లు కల్పించాలన్నదే రాహుల్ గాంధీ అభిమతమని స్పష్టం చేశారు. బీసీలకు

-మిగతా 3 లో

## భారతీయ సంస్కృతికి
# ఆలయాలే నిదర్శనం

- అవి ఆధ్యాత్మిక కేంద్రాలే కాదు.. అభివృద్ధి సూచికలు
- దేశాభివృద్ధిలో టెంపుల్ టూరిజం కీలక భూమిక
- మన కుటుంబ వ్యవస్థే మనకు నిరంతర బలం
- భక్తుల విరాళాలతోనే పేదలకు సేవచేసే భాగ్యం
- ఇంటర్నేషనల్ టెంపుల్ ఎక్స్‌పోలో సీఎం చంద్రబాబు నాయుడు



తిరుపతి,ప్రజా స్వేచ్ఛ
భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మికతకు దేవాలయాలు సజీవ సాక్ష్యాలని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మన దేశ సంస్కృతితో ఆలయాలకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాదు.. అభివృద్ధికి ప్రధాన ఆదాయ వనరులని సీఎం చంద్రబాబు అన్నారు. దేవాలయాలు ఆధ్యాత్మిక

-మిగతా 3 లో

## ఓ పెళ్లి మంటపంలో అరుదైన దృశ్యం


**-దండలు మార్చుకున్నకెసిఆర్ దంపతులు**



**గజ్వేల్, ప్రజా స్వేచ్ఛ**

గజ్వేల్‌లో అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఓ పెళ్లికి హాజరైన కెసిఆర్ దంపతులకు అక్కడ అనుకోని ఘటన ఎదురయ్యింది. సోమవారం కెసిఆర్ బర్త్‌డే కావడంతో నిర్వాహకులు దండలు తెచ్చి ఇవ్వడంతో కెసిఆర్ దంపతులు పరస్పరం మార్చుకున్నారు. ఇకపోతే కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఎర్రవెల్లిలోని తన ఫామ్ హౌస్ కు అభిమానులు, పార్టీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డితో పాలు పలువురు కీలక నేతలు కేసీఆర్ ను కలవడానికి వచ్చారు. కేసీఆర్ ను కలిసి బర్త్ డే విషెస్ చెప్పారు. భారీగా తరలివచ్చిన అభిమానులకు కేసీఆర్ ఫామ్ హౌస్ బాల్కనీ నుంచి అభివాదం తెలిపారు. కేసీఆర్ ఇవాళ ఫిబ్రవరి 17న 71వ పుట్టిన రోజు జరుపుకుంటున్న సంగతి తెలిసిందే.. కేసీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి స్పెషల్ గా బర్త్ డే విషెస్ చెప్పారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలని కోరారు. మంత్రి పొన్నం, ఏపీ డిప్యూటీ సీఎం పవన్, ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్, మంత్రి నారా లోకేష్ కేసీఆర్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో కూడా కేసీఆర్ బర్త్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు బీఆర్ఎస్ నేతలు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు,కార్యకర్తలు పాల్గొన్నారు. హరీశ్ రావు, కేటీఆర్,తలసాని పలువురు నేతలు 71 కిలోల కేక్ కట్ చేశారు.

## బీహార్ లో మరో భూకంపం




**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

ఉత్తరభారత దేశాన్ని వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. సోమవారం తెల్లవారుజామున ఢిల్లీతోపాటు రాజధాని ప్రాంతంలో భూమి కంపించింది. గంటల వ్యవధిలోనే బీహార్‌లో ప్రకంపణలు చోటుచేసుకున్నారు. ఉదయం 8.02 గంటలకు బీహార్‌లోని శివాన్ ప్రాంతంలో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 4.0గా నమోదయింది. దీంతో ప్రజలు ఇండ్ల నుంచి పరుగులు తీశారు. అంతకుముందు ఢిల్లీతోపాటు నోయిడా, గురుగ్రామ్‌లో భూకంపం వచ్చింది. ఉదయం 5. 36 గంటలకు ప్రకంపణలు వచ్చాయి. దీని తీవ్రత 4.0గా నమోదయింది. 5 నుంచి 8 సెకన్లపాటు భూమి కంపించిందని స్థానికులు వెల్లడించారు. తాము భయాందోళనలకు గురయ్యామని, ఇండ్ల నుంటి రోడ్లపైకి వచ్చేశామని తెలిపారు

## కులగణన సర్వేను ఉపయోగించుకోండి

**-మరోమారు కోరిన మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ**

కులగణన వివరాల నమోదుకు తెలంగాణ ప్రభుత్వం మరో అవకాశం ప్రజలకు ఇచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆయన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. కుల సర్వే లో పాల్గొనని వారు సమాచారం ఇవ్వని వారు ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవాలని సూచించారు. తెలంగాణ జనాభా లెక్కల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పినట్టు ఎవరెంతో వారికంత న్యాయం జరగాలన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 42 శాతం రిజర్వేషన్లకు రాజకీయ విద్య ఉద్యోగ అవకాశాల్లో చట్ట బద్దత చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పొన్నం స్పష్టం చేశారు. కులగణనలో పాల్గొనని వారు ఈనెల 28 వరకు నమోదు చేసుకోవచ్చని, దీని కోసం టోల్ ఫ్రీ నం. 040-211 11111ను ఏర్పాటు చేయడం జరిగిందని, తాము కుల సర్వేలో పాల్గొనలేదని ఫోన్ చేసిన వారి ఇంటికి వెళ్లి ఎన్యుమరేటర్లు వెళ్లి వివరాలు నమోదు చేయాలన్నారు. ఎంపిడిఒ కార్యాలయం, వార్డు ఆఫీసులకు వెళ్లి కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చని పొన్నం సూచించారు. ఆ÷-లనైన్ లో నమోదు చేసుకునే వారు కులగణన కోసం ఇక్కడ క్లిక్ చేయాలని సూచించారు, కులగణన సర్వేలో 3,56,323 కుటుంబాలు పాల్గొనలేదన్నారు. సర్వేలో పాల్గొని అందుతున్న పథకాలు అర్హులుగా ఉండాలన్నారు. ఎక్కడెక్కడ కుల సర్వేలో పాల్గొనలేదో అక్కడ కుల సంఘాల నేతలు, మేధావులు ప్రొఫెసర్లు వారికి అవగాహన కల్పించాలని, వారిని భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# కొత్త రేషన్ కార్డుల జారీకి సిఎం ఆదేశం

**-ఎన్నికల కోడ్ అమల్లో లేని జిల్లాల్లో సత్వర చర్యలు**
**-అధికారులతో సమీక్షించిన సిఎం రేవంత్**



**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ**

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోలేని జిల్లాలో వెంటనే కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో పౌరసరఫరాల శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ, కొత్త కార్డుల జారీపై అధికారులతో చర్చించారు. అలాగే.. ప్రభుత్వం జారీ చేయనున్న కొత్త రేషన్ కార్డులకు సంబంధించి పలు డిజైన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులందరికి రేషన్ కార్డులు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే.. వచ్చే ఉగాది నుంచి రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకసారి రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీమళ్లీ దరఖాస్తు చేసుకోవద్దని.. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జనవరి 26న కొత్త రేషన్ కార్డుల జారీ పక్రియను తెలంగాణ ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కొత్త రేషన్ కార్డుల జారీ పక్రియ ఆగిపోయింది. కొందరికి రేషన్ కార్డులు జారీ చేసి.. మరికొందరికి ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారుల్లో అయోమయం నెలకొంది. దీంతో అప్రమత్తమైన సీఎం రేవంత్.. రేషన్ కార్డుల జారీపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎమెల్సీ కోడ్ అమల్లో లేని జిల్లాలో వెంటనే రేషన్ కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే.. ఖమ్మం, నల్లగొండ, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలో మాత్రం ఎన్నికల కోడ్ అమల్లో లేదు. సీఎం ఆదేశాలతో ఈ మూడు జిల్లాల్లో రేషన్ కార్డుల జారీ పక్రియ షురూ కానుంది. తెలంగాణ రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి కమిషనర్ శాసనాలు ఇవ్వడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రేషన్ కార్డుల జారీ పక్రియ అర్హులందరికీ అందుబాటులోకి రానివ్వాలని, ఈ పక్రియ త్వరగా ప్రారంభించమని ఆయన్ని కోరారు. ఈ సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న జిల్లా కేంద్రాలు మినహాయించి మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ వంటి జిల్లాల్లో కొత్త రేషన్ కార్డుల జారీ పక్రియను ప్రారంభించనున్నారు. రేషన్ కార్డుల తొలగింపు విధానంలో ఎన్నికల కోడ్ ఉనికి చాలా సమయానికి మలచేందుకు గమనించి, మొదటి సారి ఎంపిక చేయడానికి ప్రత్యుత్తరంగా జారీ లో తిరుగుబాటు పనిలో దీర్ఘ కార్యక్రమాలు ఉండాయి.

# ప్రారంభమైన పెద్దగట్టు జాతర

**ఎటుచూసినా జనసంద్రం...**
**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి ప్రత్యేక పూజలు**
**ఈనెల 20 వరకు ట్రాఫిక్ మళ్లింపు : డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి**



**సూర్యాపేట,ప్రజా స్వేచ్ఛ**

శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర ప్రారంభమైంది. ఆదివారం అర్ధరాత్రి దేవరపెట్టె చేరుకోవడంతో దురాజ్ పల్లి పెద్దగట్టు జాతర ప్రారంభమైంది. 'ఓ లింగ ఓ లింగా' నామస్మరణతో పెద్దగట్టు మారుమ్రోగుతోంది. గుట్ట చుట్టూ వాహనాలు చేరి.. జాతర భక్త జనసంద్రంగా మారింది. సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి లింగమంతుల స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జాతర సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ సెలవులు ప్రకటించారు. గా తెలంగాణలో సమ్మక్క సారలమ్మ జాతర తరువాత రెండో అతిపెద్ద జాతరగా పేరొందిన సూర్యాపేట శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర ఆదివారం రాత్రి ప్రారంభమైంది. జాతరలో కీలకమైన దేవరపెట్టె (అందెనపు చౌడమ్మ, లింగమంతుల స్వామి ఉత్సవ మూర్తులు)కు ఆనవాయితీ ప్రకారం కేసారం గ్రామంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవరపెట్టెను ఊరేగింపుగా ఆదివారం అర్ధరాత్రికి దురాజ్‌పల్లిలోని పెద్దగట్టుకు చేర్చారు. దీంతో జాతర ప్రారంభమైనట్లు నిర్వాహకులు ప్రకటించారు. కేసారంలోని మెంతబోయిన వంశస్తులకు చెందిన దేవరగుడిలో దేవరపెట్టెకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మున్నా, గొర్ల, కులస్తులతోపాటు సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీషరెడ్డి, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేషరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఇక, పెద్దగట్టు జాతర నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ మార్గంలో ట్రాఫిక్ మళ్లింపు చేస్తున్నామని కోదాడ డీఎస్పీ ఎం. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు కోదాడ సమీపంలోని బాలాజీనగర్ ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్‌ను మళ్లించి, హుజుర్‌నగర్, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కెట్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు పంపుతారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను కూడా అదే మార్గంలో కోదాడ వద్ద జాతీయ రహదారితో కలవనున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు ఈ ట్రాఫిక్ మళ్లింపు ఉంటుంది.

## సీఈసీ ఎంపిక కోసం ప్రధాని అధ్యక్షతన ఉన్నతస్థాయి భేటీ..

**- వాయిదా వేయాలని కాంగ్రెస్ డిమాండ్**

**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**




కొత్త ఎన్నికల ప్రధాన అధికారి ఎంపిక కోసం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరుగుతున్నది. ఈ సమావేశంలో కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ప్రస్తుత ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ పదవీకాలం మంగళవారం (ఫిబ్రవరి 18)తో ముగియనున్న విషయం తెలిసిందే. అయితే, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎంపిక వాయిదా వేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ నేతలు అభిషేక్ సింఘ్వి, అజయ్ మాకెన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఈసీ నియామకం అంశంపై సుప్రీంకోర్టులో ఈ నెల 19న విచారణ జరుగుతుందని.. ఈ క్రమంలో భేటీని వాయిదా వేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. వాస్తవానికి గతేడాది నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సీఈసీ, ఈసీల నియామకానికి కొత్త చట్టం పార్లమెంట్‌లో తీసుకువచ్చి ఆమోదించింది. ప్రధాన ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సైతం సభ్యుడిగా ఉండగా.. ఆయన స్థానంలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి అవకాశం కల్పిస్తూ చట్టాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

## నిషేధిత చైనా డ్రోన్ ఎగరేసిన రాహుల్ గాంధీ..

**-వెల్లువెత్తిన విమర్శలు**

**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**



కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మరో వివాదం చుట్టుముట్టింది. నిషేధిత చైనా డ్రోన్‌ను ఆయన ఎగురవేశారు. ఇలాంటి టెక్నాలజీ దేశంలో లేదని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి. రాహుల్ గాంధీ శనివారం ఎక్స్‌లో ఒక వీడియో పోస్ట్ చేశారు. 2022లో భారత్ నిషేధించిన చైనాలోని షెన్‌జెన్‌కు చెందిన డీజేపీ టెక్నాలజీ కంపెనీ తయారు చేసిన డ్రోన్ ఎగురవేశారు. ఆ తర్వాత డ్రోన్స్ అండ్ వార్స్ గురించి ఆయన మాట్లాడారు.కాగా, డ్రోన్‌లను తయారు చేయడానికి దేశానికి బలమైన ఉత్పత్తి స్థావరం అవసరమని రాహుల్ గాంధీ తెలిపారు. ఉత్తి మాటలు కాదంటూ ప్రధాని మోదీపై మండిపడ్డారు. 'డ్రోన్‌లు కేవలం ఒక సాంకేతికత కాదు, అవి బలమైన పారిశ్రామిక వ్యవస్థ ద్వారా ఉత్పత్తి అయిన ఆవిష్కరణలు. దురదృష్టవశాత్తు దీనిని గ్రహించడంలో ప్రధాని మోదీ విఫలమయ్యారు. ఆయన ఏఐపై 'టెలిప్రాంప్టర్' ప్రసంగాలు చేస్తున్నారు. మన పోటీదారులు కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను నేర్చుకుంటున్నారు. భారతదేశానికి బలమైన ఉత్పత్తి స్థావరం అవసరం, ఉట్టి మాటలు కాదు' అని విమర్శించారు. డ్రోన్ల భాగాలు దేశంలో తయారు కావడం లేదని, ఆప్టిక్స్ గురించి కూడా తయారుదారులకు అవగాహన లేదని ఆరోపించారు.

www.prajaswecha.com ప్రజా స్వేచ్ఛ PRAJA SWECHA

# కారణజన్ముడు కేసీఆర్

(మొదటి తరువాయి)

చెప్పారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఉద్యమాన్ని నడిపారు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. కేసీఆర్ 71వ జన్మదినం సందర్భంగా హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలిలో విపక్ష నేత మధుసూధనా చారి, ఎమ్మెల్యే హరీశ్ రావు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణను స్వప్నించి సాకారం చేసిన మహోన్నతుడు కేసీఆర్ అని చెప్పారు. రాష్ట్రంలో ఎవరిని కదిపినా మళ్లీ కేసీఆర్ రావాలంటున్నారని వెల్లడించారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో అందరం కలిసి పనిచేద్దామన్నారు. కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ జాతిది వీరోచితమైన చరిత్ర అని మండలిలో విపక్ష నేత మధుసూదనా చారి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఎంతో నష్టపోయిందని చెప్పారు. ఈ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని చూసి కేసీఆర్ చలించిపోయారని తెలిపారు. తెలంగాణ



ఏర్పాటును అడ్డుకునేందుకు ఎన్నో కుట్రలు జరిగాయని వెల్లడించారు. స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత కేవలం ఏడాదిలో దేశం మొత్తం మనవైపు చూసేలా తయారు చేశారని చెప్పారు. తెలంగాణను ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లిన నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. కేసీఆర్ సత్తా ఏంటో చంద్రబాబు, వైస్సార్‌కు తెలుసని వెల్లడించారు.

**కేసీఆర్ అంటే నాలుగుకోట్ల మంది ప్రజల భావోద్వేగం : హరీశ్‌రావు**

కేసీఆర్ అంటే నాలుగు కోట్ల మంది ప్రజల భావోద్వేగమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్‌కు తెలంగాణకు ఉన్న బంధం పేగు బంధమని చెప్పారు. కేసీఆర్ ది తెలంగాణ ప్రజలది తల్లీబిడ్డల బంధమని తెలిపారు. 1969 మలిదశ ఉద్యమ సమయంలో కేసీఆర్ వయసు 15 ఏండ్లని, అప్పుడే జై తెలంగాణ అని నినదించిన నాయకుడని చెప్పారు. వేల గంటల మేధోమథనం తర్వాత కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారన్నారు. తెలంగాణ కోసం అన్ని పదవులు త్యాగం చేసిన నాయకుడని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ లాంటి ఎంతోమంది మేధావులు కేసీఆర్ వెంట నడిచారన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ను ఎన్నో రకాలుగా వేధించారని చెప్పారు. తెలంగాణ వచ్చిందంటే కేసీఆర్ మొండి పట్టుదలే కారణమని తెలిపారు.

# ఢిల్లీ లో భూకంపం

(మొదటి తరువాయి)

సంభవించాయి. దేశ రాజధాని ఢిల్లీలో స్వల్ప భూప్రంకపనలు వచ్చాయని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ ఎక్స్ వేదికగా తెలిపింది. భూకంప కేంద్రం లోతు కేవలం 5 కిలోమీటర్లు మాత్రమేనని స్పష్టం చేసింది. కొన్ని సెకన్ల పాటు మాత్రమే భూమి కంపించడంతో భయాందోళనలకు గురైన జనం ఇళ్లలోంచి బయటకు పరుగులు తీశారు. మంచం నుండి కిటికీ వరకు ప్రతిదీ కదలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్ ప్రాంతాల్లో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 4.0గా నమోదైంది. ధౌలా కాన్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలేజీ సమీపంలో 5 కిలోమీటర్ల భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రకంపనలు సంభవించిన సమయంలో భారీ శబ్దం వినిపించడంతో ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. ఢిల్లీలో సంభవించిన భూకంపంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. మళ్లీ భూప్రకంపనలు వచ్చే అవకాశం ఉందని... అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. భద్రతా చర్యలు పాటించాలని, పరిస్థితులను అధికారులు సునిశితంగా పరిశీలిస్తున్నారని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి. భద్రతా చర్యలు పాటించాలి. మళ్లీ ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. పరిస్థితులను అధికారులు సునిశితంగా పరిశీలిస్తున్నారని ప్రధాని మోదీ వెల్లడించారు.

# కులగణన కొరివితో తలగోక్కున్న కాంగ్రెస్

(మొదటి తరువాయి)

తొలగించి బీసీ జాబితా పంపితే కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత మాదే అని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో.. తెలియదని, ఐఏఎస్ లను తప్పు చేయాలని ముఖ్యమంత్రే అంటారా అని బండి సంజయ్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర కేబినెట్ మంత్రుల్లో, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చిందని, కొందరు మంత్రులు ప్రతి పనికి 15 శాతం కమిషన్ దండుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ అంటేనే బాకీల సర్కార్.. మేధావులారా?. బాకీల సర్కార్ ను బండకేసి బాదండి.. 3 ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ గెలవబోతోందని ఆయన అన్నారు. అంతేకాకుండా..'ఇకపై ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించేది బీజేపీనే.. ఓట్లు అడిగే బీజేపీకే ఉంది.. ఉద్యోగులు, నిరుద్యోగుల పక్షాన నిరంతరం కొట్లాడి జైలుకు వెళ్లింది బీజేపీ కార్యకర్తలే.. ఏనాడైనా టీచర్లు, నిరుద్యోగుల పక్షాన కాంగ్రెస్ కొట్లాడిందా అని అన్నారు. ..బీఆర్ఎస్ పనైపోయింది. అందుకే అభ్యర్థిని కూడా నిలబెట్టలేకపోయింది.. కాంగ్రెస్ తో కుమ్మక్కై బీజేపీని ఓడించాలని బీఆర్ఎస్ చూస్తోంది,.. క్రైస్తవుల్లో చాలా మంది ఎస్సీ సర్టిఫికెట్లు తీసుకుంటూ ఎస్సీలను మోసం చేస్తున్నారు.. ఇంత జరుగుతుంటే సంఘాలు ఎందుకు స్పందించడం లేదన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ముకాయడమే కుల సంఘాల పనా?.. మేధావులారా?. కాంగ్రెస్ ను ఓడించండి? బీజేపీని గెలిపించండి' అని బండి సంజయ్ అన్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

(మొదటి తరువాయి)

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ఈ సమస్యపై సమగ్రంగా చర్చించారు. అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అణచివేయాలని సంబంధిత శాఖల అధికారులను సీఎం ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక సరఫరా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకు తగినంత ఇసుక కావాంటే ముందుగా అక్రమార్కులపై కొరడా ఝుళిపించాలని సీఎం సూచించారు. ఇదిలా ఉండిగా ఇందిరమ్మ పథకం కింద లబ్దిదారులకు రూ. 5 లక్షలు అందించనున్నారు. వాళ్ల ఖర్చును తగ్గించేందుకు ఇసుకను ఉచితంగా అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంది. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయవంతంగా అమలు చేయడానికి అక్రమ రవాణా అడ్డుకట్ట తప్పనిసరి అని సీఎం పేర్కొన్నారు. అందుకే, అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపడంతోపాటు, ప్రభుత్వ పథకాలకు అవసరమైన ఇసుక సరఫరా నిరాటంకంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# భారతీయ సంస్కృతికి ఆలయాలే నిదర్శనం

(మొదటి తరువాయి)

కేంద్రాలే కాదు.. అభివృద్ధికి సూచికలు అని వ్యాఖ్యానించారు. తిరుపతి వేదికగా 2వ ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పోను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్‌తో కలిసి ప్రారంభించారు చంద్రబాబు.. మూడు రోజుల పాటుఈ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో కొనసాగనుంది..తిరుపతిలో ప్రారంభమైన అంతర్జాతీయ ఆలయ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతికి వచ్చిన అందరికీ స్వాగతం పలుకుతూ.. ఈ ఎక్స్‌పోలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. కుంభమేళాలో 55 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు చేశారని చెబుతూ..ఇదొక మహత్తర ఘట్టమని అన్నారు. అంటే, దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కాదు.. అభివృద్ధికి సూచికలు అని అభివర్ణించారు.. దేశాభివృద్ధిలో టెంపుల్ టూరిజం కీలక పాత్ర పోషిస్తోందన్నారు.. ఇవాళ ప్రతి ఇంట్లో ఒక ఏఐ నిపుణుడు తయారవుతున్నాడు. టెక్నాలజీ వినియోగంతో మనం మరింత ముందుకెళ్లాలి. ఆధ్యాత్మికవైపు అందరూ అడుగులు వేస్తున్నారు. ఎందరో భక్తులు రూ.కోట్ల విరాళాలు ఇస్తున్నారు. ఆ విరాళాలను పేదల శ్రేయస్సు కోసం ఖర్చు చేస్తున్నాం అని అన్నారు. కుటుంబ వ్యవస్థ మన దేశానికి అతిపెద్ద బలం. మన సంస్కృతి, వారసత్వ పరిరక్షణలో దేవాలయాలది ప్రధాన పాత్ర అన్నారు. దేవుడికి సేవచేయడం అన్నింటికంటే ఎంతో గొప్పది. తిరుమల బాలాజీ అంటే కోట్లాది మంది భక్తుల విశ్వాసం. నమ్మకం. ఏపీలోని దేవాలయాలకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తాం. తిరుమలలో 75శాతం పచ్చదనం ఉండేలా చూస్తున్నాం. ఏపీలోని దేవాలయాల సర్క్యూట్ ఏర్పాటు చేస్తున్నాం. దేవాలయాల్లో గ్రీన్ ఎనర్జీ వినియోగిస్తాం. దేవుడికి సేవచేయడం అన్నింటికన్నా గొప్ప కార్యక్రమం అని చంద్రబాబు అన్నారు. ఏపీలోని దేవాలయాల్లో అన్నదానం కార్యక్రమాన్ని ఎన్టీఆర్ ప్రారంభించారు. నిత్యం లక్షలాది మంది భక్తులు అన్నప్రసాదం తీసుకొంటున్నారు. ప్రపంచ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని మనం కోరుకుంటాం అని చెప్పారు. దేశ విదేశాల్లో బాలాజీ ఆలయాలు పెరుగుతున్నాయి. ఇంకా పెరగాలి. దేశానికి సరైన సమయంలో సరైన నేత ప్రధానిగా ఉన్నారని మోడీ గురించి చెప్పారు. టెక్నాలజీ అందిపుచ్చుకోవడంలో మనం ముందున్నాం. దేశంలో యువత ఎక్కువగా ఉండటం మనకు మరో అదృష్టం. 2047 నాటికి మనం నంబర్. 1 లేదా 2కు చేరుకోవాలి. పి4 విధానంలో దేశంలో మౌలికవసతులు మరింత పెరగాలి. ఏపీలోని దేవాలయాల్లో మౌలిక వసతులు పెంచాం. ఏడు నెలల్లోపే దేవాలయాలకు రూ.134 కోట్లు ఖర్చు చేశామన్నారు.. అర్చకులకు జీతాలు ఇస్తున్నాం. వేద పాఠశాలలకు నిధులు కేటాయిస్తున్నాం. పెద్ద దేవాలయాలకు కమిటీలు వేసి వాటి ద్వారా నిర్వహిస్తున్నాంఅని చంద్రబాబు వివరించారు. కోట్లమంది భక్తులు విరాళాలు ఇస్తున్నారు.. వాటిని విద్య, వైద్యం సహా ఇతర సేవ కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తున్నాం అని బాబు అన్నారు. అన్నదానం ఎన్టీఆర్ ప్రారంభిస్తే.. దానికి రెండువేల కోట్లు విరాళాలు రూపంలో వచ్చాయి.. ప్రాణాదానం ట్రస్ట్ కు 440 కోట్లు విరాళంగా వచ్చాయని వెల్లడించారు..దేశ, విదేశాలలో వెంకటేశ్వర స్వామి ఆలయాలు పెరుగుతున్నాయి.. ఇంకా పెరగాలని కోరుకుంటున్నానని అన్నారు.. మన సంస్కృతి , వారసత్వ పరిరక్షణకు దేవాలయాలది ప్రధాన పాత్ర అని పేర్కొన్నారు..మరోసారి ప్రధాని మోడీపై ప్రశంసలు కురిపించారు సీఎం చంద్రబాబు.. దేశానికి సరైనా సమయంలో సరైనా ప్రధానిగా నరేంద్ర మోడీ ఉన్నారని పేర్కొన్నారు.. రాష్ట్రంలో అత్యుత్తమ రాజధానిగా అమరావతి నిర్మాణం జరుగుతుందన్నారు. దేవుడి సేవ చేయడం.. అన్నిటికన్నా గొప్పది.. పక్కవాడికి మోసం ఈ జన్మలో కర్మఫలం అనుభవించాలి అంటూ వ్యాఖ్యానించారు. మన దేవాలయాల చరిత్ర ఎంతో పురాతనమైనదని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. దక్షిణ భారత్‌లోని ఆలయాలు చూసి విదేశీయులు ఆశ్చర్యపోతున్నారు. వేల ఏళ్ల క్రితం ఇలాంటి ఆలయాలు ఎలా కట్టారని అడుగుతారు. దేవాలయాల ప్రాంగణాల్లో ఆనాడు విద్యార్థులకు బోధన జరిగేది. ఇవాళ 55 శాతం మంది పర్యాటకులు ధర్మ పర్యటన చేస్తున్నారు.

# కుల సంఘాలకు హైకోర్టు షాక్

(మొదటి తరువాయి)

ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవేళ ఇప్పటికే నిర్మాణాలు చేపట్టి ఉన్నట్లయితే అవి తుది తీర్పునకు లోబడి ఉంటాయని గతంలోనే ఉత్తర్వులున్నాయనీ.. వీటితోపాటు ఇకపై ఎలాంటి నిర్మాణాలు, చేపట్టరాదని వెలమ, కమ్మ, విశ్వబలిజ కాపు సంఘాలకు ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో కమ్మ, వెలమ సంఘాల కమ్యూనిటీ భవనాలకు ఐదెకరాలు, విశ్వ బలిజ కాపు సంఘం కమ్యూనిటీ భవనానికి ఆరెకరాలకు పైగా భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం వేర్వేరు జీవోలు జారీ చేసింది. ఈ జీవోలపై రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, న్యాయవాది సుంకర నరేష్ వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుక యారాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ప్రభుత్వం కుల సంఘాలకు నామమాత్రపు ధరకే భూమిని కేటాయించిందన్నారు. ఇందులో నిర్మాణాలు జరగకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని, ఆ జీవోలను కొట్టివేయాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం ప్రభుత్వ వివరణ కోరుతూ విచారణను మార్చి 7కు వాయిదా వేసింది.

# రాహుల్ కులం పేరుతో బీజేపీ వ్యర్థ రాజకీయం

(మొదటి తరువాయి)

జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయాలని రాహుల్ గాంధీ కులగణన కోసం డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ..రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా బీసీ కులగణన కోసం పట్టుబడుతున్నారన్నారు. కులగణన అంశాన్ని పక్కదారి పట్టించేందుకు రాహుల్ గాంధీని బీజేపీ నేతలు టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ విజన్ ఉన్న నాయకుడని తెలిపారు. 30 సంవత్సరాలుగా ఎలాంటి మంత్రి పదవుల్లో లేకుండా దేశం కోసం పనిచేస్తున్నారని చెప్పుకొచ్చారు. అందుకే గ్రామ స్థాయి నుంచి ప్రధాని వరకు రాహుల్ గాంధీని టా÷-గ్గ÷ట్ చేస్తూ కించపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. విద్వేష, విధ్వంసమే బీజేపీ విధానమని వ్యాఖ్యలు చేశారు. ప్రేమ, శాంతి, సమానత్వం కోసం రాహుల్ గాంధీ పనిచేస్తున్నారని

చెప్పారు. బీజేపీ విద్వేష విధ్వంసాలు కావాలో.. కాంగ్రెస్ శాంతి, సమానత్వం, అభివృద్ధి కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. కుల గణన అంశాన్ని డైవర్ట్ చేయడం కోసమే రాహుల్ మతంపై చర్చ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా దేశం కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం బీజేపీ చేసింది ఏమీ లేదన్నారు. విభజన రాజకీయాలతో పదవులు పొందటం బీజేపీ నేతల నైజమని వ్యాఖ్యలు చేశారు. రాహుల్ పదవుల కోసం పాకులాడే మనిషి కాదన్నారు. త్యాగాల వారసత్వంతో సమాజ అభివృద్ధి కోసం, సమసమాజ లక్ష్యం కోసం రాహుల్ పోరాటం చేస్తున్నారని వెల్లడించారు. ఆదాని ఆస్తుల పెంపకం కోసం రాహుల్ పనిచేయటం లేదని తెలిపారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అంతరాలు లేని సమాజమే రాహుల్ గాంధీ లక్ష్యమని స్పష్టం చేశారు. బీజేపీ విద్వేష రాజకీయాలతో సమాజం వెనుకబాటుకు లోనవుతోంద న్నారు. తొలి ప్రధాని నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు చేపట్టిన సంస్కరణలే ఈరోజు దేశాన్ని నిలబెడుతున్నాయని తెలిపారు. రాజ్యాంగ మీద ప్రమాణం చేసి కేంద్ర మంత్రి అయిన బండి సంజయ్ నిర్దేశ ప్రసంగాలు చేస్తూ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారన్నారు. అణగారిన వర్గాలు, పేద ప్రజలంటే బీజేపీకి పట్టదని.. ప్రజలంతా బీజేపీ నైజాన్ని గ్రహించాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# భారతీయ సంస్కృతికి ఆలయాలే నిదర్శనం

(మొదటి తరువాయి)

వచ్చినా సిఎం అభ్యర్థిని ఎంపికచేయడంలో బిజెపి మల్లగుల్లాలు పడుతోంది. సోమవారం ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి ఎవరనే విషయానికి తెరపడుతుందని అంతా భావించారు. కాగా, ఢిల్లీ పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. దీంతో నూతన సీఎంపై ఉత్కంఠ కొనసాగుతున్న వేళ మరో రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఫిబ్రవరి 19న జరిగే సమావేశంలో బీజేఎల్పీ నేతను ఎన్నుకోనున్నారు. ఈ సమావేశంలో నూతనంగా ఎన్నికైన 48 మంది బీజేపీ ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. అలాగే కమలం పార్టీ ఎంపీలు సైతం హాజరుకానున్నారు. బీజేఎల్పీ నేత ఎన్నిక తర్వాత ఎమ్మెల్యేలు లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలవనున్నారు. ఇప్పటికే ఢిల్లీ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం కోర్డినేటర్లుగా వినోద్ తావ్డే, తరుణ్ చుగ్‌లను బీజేపీ అధిష్ఠానం నియమించింది. మరోవైపు ఫిబ్రవరి 20న ముఖ్యమంత్రి, మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి తేదీ సైతం ఖరారు చేసింది. కాగా, ఢిల్లీ ముఖ్యమంత్రి రేసులో పర్వేష్ వర్మ(న్యూ ఢిల్లీ), రేఖా గుప్తా (షాలిమార్ బాగ్), విజేందర్ గుప్తా (రోహిణి), సతీష్ ఉపాధ్యాయ్ (మాల్వియా నగర్), ఆశిష్ సూద్ (జనక్‌పురి), పవన్ శర్మ (ఉత్తమ్ నగర్), అజయ్ మహావార్ (ఘోండా) ఉన్నారు. ఏడాది ఫిబ్రవరి 5న జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగరవేసిన సంగతి తెలిసిందే. దాదాపు 27 ఏళ్ల తర్వాత కమలం పార్టీ అక్కడ అధికారంలోకి రానుంది. మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో 48 స్థానాలను బీజేపీ కైవలం చేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం 22 స్థానాలకే పరిమితమైంది. ఆ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు పలువురు కీలక నేతలు ఓటమి పాలయ్యారు. కాగా, ప్రస్తుతం ఢిల్లీ సీఎం ఎవరనే విషయం ఉత్కంఠ కొనసాగుతోంది


## సంపాదకీయం

# మూడు భవనాలు, ముగ్గురు మాజీలు!

హైదరాబాద్‌లోని ప్రగతి భవన్, విశాఖపట్నంలోని రుషికొండ ప్యాలస్, ఢిల్లీలోని శీష్ మహల్... ఈ మూడు భవనాలూ ఇటీవల దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచాయి. ప్రగతి భవన్‌ను తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, రుషికొండ ప్యాలస్‌ను ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్‌రెడ్డి వారి హయాంలో నిర్మించగా, శీష్ మహల్ ఆధునీకరణకు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన హయాంలో శ్రీకారం చుట్టారు. అత్యాధునిక వసతులతో కూడిన ఈ మూడు భవనాలు ఎంత ప్రాచుర్యం పొందాయో, అంతకు రెట్టింపుస్థాయిలో విమర్శలపాలయ్యాయి. వీరు ముగ్గురూ మాజీలు కావడంలో వాటి పాత్ర కాదనలేనిది హైదరాబాద్ నడిబొడ్డులో ఉన్న ఐఏఎస్, ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారుల నివాస గృహాలను నేలమట్టం చేసి అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యాధునిక సౌకర్యాలతో ప్రగతిభవన్‌ను నిర్మించారు. దానిని ముఖ్యమంత్రి అధికారిక నివాసగృహంగా, సీఎం క్యాంప్ ఆఫీసుగా ప్రకటించి అక్కడినుంచే పాలనా వ్యవహారాలు చూసుకున్నారు. ఆ కాలంలో కేసీఆర్ రాష్ట్ర సచివాలయానికి వెళ్ళిన దాఖలాలు లేవు. ప్రగతిభవన్‌లోకి కేవలం ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు, ప్రముఖులకు మాత్రమే ప్రవేశం ఉండేది. సామాన్య ప్రజలకు, కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడినవారికి ప్రవేశం లేకపోవడం ఆయన నియంతృత్వ పోకడలకు నిదర్శనమని రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ఉధృతంగా ప్రచారం చేసింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ గడీ గోడలు బద్దలు కొట్టి, సామాన్య ప్రజలకు ప్రవేశం కల్పిస్తామని ప్రకటించింది. అధికారంలోకి రాగానే ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చి గేట్లు తొలగించారు, అందులో ప్రజావాణి కార్యాలయాన్ని నెలకొల్పారు. అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలోని ఫ్లాగ్ స్టాఫ్ రోడ్డు, సివిల్ లైన్స్‌లో ఉన్న ఆరో నెంబరు బంగ్లాను తన అధికారిక నివాసంగా ఉపయోగించారు. ఆ సమయంలో ఆ బంగ్లాను అత్యాధునిక వసతులతో కేజ్రీవాల్ ఆధునీకరించారు. దీనికి సుమారు రూ.80కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ పరిణామమే కేజ్రీవాల్ పాలిట శాపంగా మారింది. సకల సౌకర్యాలతో ఆధునీకరించిన ఈ బంగ్లాను అయిదు నక్షత్రాల వసతులతో కూడిన అద్దాలమేడ (శీష్ మహల్)గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణిస్తూ కేజ్రీవాల్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. లిక్కర్ స్కామ్ కూడా దీనికి తోడవటంతో బీజేపీ ధాటికి ఆప్ ఉక్కిరిబిక్కిరి అయ్యింది. పర్యవసానంగా ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ పార్టీతో పాటూ స్వయంగా దాని అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఓటమి పొందారు. ఆప్ అధికారాన్ని కోల్పోయాక కేజ్రీవాల్ కోట్లాది రూపాయలు వెచ్చించి ఆధునీకరించిన శీష్ మహల్‌పై తలెత్తిన వివాదాల నేపథ్యంలో కొత్త ప్రభుత్వం కూడా దానిని ఉపయోగించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇక, ఆంధ్రప్రదేశ్‌లో రుషికొండ ప్యాలస్ నిర్మాణాలపై అనేక విమర్శలు వెల్లువెత్తినా జగన్ వాటిని బేఖాతరు చేశారు, తాను కోరుకున్నట్టుగా దానిని పూర్తి చేశారు. ఆ ప్యాలస్ ఫోటోలు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. జగన్ ఓటమి పాలై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలుగుదేశం నేతలు ఆ భవనాల ఫోటోలు బయటపెట్టారు. ఆ విలాసాల్ని చూసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలతో పాటు యావత్ దేశ ప్రజలు బిత్తరపోయారు. రుషికొండపై ఆ రాజసౌధాల నిర్మాణానికి రూ.500కోట్లకు పైగా జగన్ ఖర్చు చేసినట్లు విపక్ష పార్టీలు చెపుతున్నాయి. ఈ భవనాల నిర్మాణంలో జాతీయ పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల పరిరక్షణ సంస్థ నియమాలను జగన్ ప్రభుత్వం ఉల్లంఘించింది.

వైసీపీ వర్గాలు కాదంటున్నప్పటికీ ముఖ్యమంత్రి అధికారిక నివాసం, క్యాంప్ ఆఫీసు కోసమే రుషికొండపై ఈ ఇంద్రభవనాలను నిర్మించినట్లు ప్రజలు బలంగా విశ్వసించారు. జగన్ రాజకీయాలలో ఉన్నంత వరకు రుషికొండ ప్యాలస్ నిర్మాణాలు విపక్ష పార్టీలకు రాజకీయ విమర్శనాస్త్రాలుగా ఉపయోగపడతాయి. వందల కోట్ల రూపాయలతో నిర్మించిన ఆ ప్రభుత్వ భవనాలు ఇప్పుడు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని ఎలా ఉపయోగించుకోవాలో ప్రస్తుత ప్రభుత్వ పెద్దలకు కూడా అర్థం కావడం లేదు. ముఖ్యమంత్రులకు ప్రభుత్వపరంగా స్థిరమైన అధికారిక నివాస గృహాలు, క్యాంప్ ఆఫీసులు ఉండాల్సిందే. కానీ దీనిని ఆసరా చేసుకుని వాటిని విలాసవంతమైన దర్బార్లుగా మార్చేందుకు వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం ఏ మాత్రం సరికాదు. ముఖ్యమంత్రుల అధికారిక నివాస గృహాలు ప్రజల సొమ్ముతో నిర్మించతలచినప్పుడు పాలకులు కచ్చితంగా కొన్ని నియమాలు పాటించాలి. సదరు నివాసాలను ఎక్కడ, ఎందుకు, ఎంత ఖర్చుతో నిర్మించబోతున్నదీ, వాటి ప్లాన్ ఎలా ఉన్నదీ క్యాబినెట్ సమావేశాల్లో చర్చించాలి, శాసనసభకూ తెలియచేయాలి. ప్రజాక్షేత్రంలో ఆ వివరాలన్నీ ఉంచి, అందరి ఆమోదంతో ముందుకు వెళ్ళాలి. ఇటువంటి కనీస నియమాలు పాటించకుండా, శాశ్వతంగా తామే ముఖ్యమంత్రులం అన్నట్లుగా కేసీఆర్, జగన్, కేజ్రీవాల్‌లు తమ హయాంలో ప్రగతిభవన్, రుషికొండ ప్యాలస్, శీష్ మహళ్ళ విషయంలో వ్యవహరించడం శోచనీయం. జవాబుదారీతనాన్ని విస్మరించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన ఎంత గొప్ప నాయకుడైనా ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

# కులగణన సర్వేతో ప్రభుత్వం అభాసుపాలు !



ప్రధాని మోడీ బిసి కాదు..ఆయన కులం తరవాత బిసిలో చేరింది...అందుకే మోడీ బిసి అయ్యారు. అందువల్ల ముందునుంచీ ప్రధాని మోడీ బిసి కాదు...ఈ విసయాన్ని ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి ప్రస్తావిస్తూ.. అసలు మోడీ బిసియే కాదని సెలవిచ్చారు. ఇప్పుడు మోడీ బిసి అయినంత మాత్రన ఒరిగేదేమీ లేదు. కానందువల్ల వచ్చే నష్టం కూడా లేదు. బిసి కులగణన సందర్భంగా జరుగుతన్న విమర్శలకు సమాధానం ఇచ్చే క్రమంలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. నిజానికి రాజకీయాల్లో ఇలాంటి వ్యాఖ్యలే అస్థిరతకు కారణం అవుతాయి. తనకు రాజకీయల లబ్ది జరుగుతుందని భావించే సిఎం రేవం÷– ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందులో సందేహం లేదు. దీనిని బిజెపి నేతలు సభజంగానే తిప్పికొట్టారు. సిఎం రేవంత్‌పైనా విరుచుకు పడ్డారు. రాహుల్ కులమేంటో చెప్పాలన్న డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజలకు మేలుచేసేవి ఎంతమాత్రం కాదు. రెచ్చొగట్టే వ్యాఖ్యలతో రాజకీయాలను కలుషితం చేయరాదు. రాజకీయ నాయకులు అసలు విషయం మరచి, పాలనను మరచి ఇలాంటి వ్యాఖ్యలతో కాలక్షేపం చేస్తూ ఉంటారు. నిజానికి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 మాసాలు అవుతోంది. ఈ కాలంలో ఎన్ని మంచి పనులు చేశామో, ఎన్ని చేయలేకపోయామో ఆత్మవిమర్శల చేసు కోవాల్సి ఉంది. అలాగే కులగణనతో జరిగే లాభం అంతకన్నా లేదు. ఎందుకంటే కులగణనతో బిసి రిజర్వేషన్లు ఇచ్చే అధికారం ప్రభుత్వానికి లేదు. అసెంబ్లీలో కులగణన సర్వే ప్రవేశ పెట్టిన ప్రభుత్వం ఓ రకంగా అభాసు పాలయ్యింది. అందుకే మరోమారు రీ సర్వేకు ఆదేశించింది. తొందరపడి సర్వే చేపట్టడం కేవలం రాహుల్‌ను సంతృప్తి పరచే రాజకీయ విన్యాసం తప్ప మరోటి కాదు. రాహుల్ ఆదేశాలను పాటించేందుకే ఉన్నానని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు..కనుక ఈ తతంగం అంతా అందుకోసమే అని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ క్రమంలోనే తీవ్ర విమర్శలు రావడంతో కలుగణన రీసర్వే మొదలైంది. ఈనెల 28 వరకు కులగణనలో నమోదు చేసేందుకు ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రజలు మూడంచెల విధానంలో రెండోసారి సర్వే చేస్తోంది సర్కార్. మరోవైపు రీసర్వేపైనా వి విపక్షాలు మర్శలు గుప్పిస్తున్నాయి. చిత్తశుద్ధిలేని సర్వేలు ఎన్నిసార్లు చేసిన బూడిదలో పోసిన పన్నీరే అంటున్నాయి. తెలంగాణలో కులగణన తప్పుల తడక అంటూ విపక్షాలు, బీసీ , ఎస్సీ ఎస్టీ సంఘాల నుంచి విమర్శలు రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రీ సర్వే చేపట్టింది. కులగణనలో వివరాలు నమోదు చేసుకోనివారంతా ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరుతున్నారు. రెండోసారి సర్వేకోసం మూడంచెల విధానాన్ని అధికారులు అమలు చేస్తున్నారు. ఆన్‌లైన్ తో పాటు ఆఫ్ లైన్‌లోనూ వివరాలు సేకరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు. ఈ టోల్ ఫ్రీ నెంబర్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందని తెలిపారు. ఫోన్ చేసిన వారి ఇళ్లకి వెళ్లి ఎన్యుమరేటర్లు వివరాలు నమోదు చేసుకుంటున్నారు. కులగణనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏకంగా బీసీ కమిషన్ రంగంలోకి దిగింది. గతంలో నిర్వహించిన సర్వేలో మొత్తం కోటి 15లక్షల కుటుంబాలకు గాను కోటి12 లక్షల కుటుంబాలు సర్వేలో పాల్గొన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో వెల్లడించింది. కులగణనలో పాల్గనని 3లక్షల 56వేల మంది కోసం రెండోసారి సర్వేకు అవకాశం కల్పించింది. మొత్తంగా సర్వే అభాసు పాలయ్యింది. పరస్పర విమర్శలు మిగిలాయి. మోడీ కులంతో పాటు, రాహుల్ కులం గురించి కూడా విమర్శలు రావడం చూస్తున్నాం. ఇకపోతే పాలనా పగ్గాలు చేపట్టిన తరవాత కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకోవడంలోనే రేవంత్ రెడ్డి కాలం గడిచి పోతోంది. ఢిల్లీ ప్రదక్షిణలకే సమయం సరిపోవడం లేదు. ఢిల్లీ నేతలు కూడా తరచూ తిప్పించుకునే పనిని మానడం లేదు. ఇకపోతే మంత్రులు ఎవరికి వారు యమునాతీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సిఎం రేవంత్ రెడ్డి పరిస్థితి దినదినగండంగా ఉంది. స్పష్టమైన పనులు చేపట్టలేదు. పాలనలో దూకుడు కనిపించడం లేదు. అందుకే ప్రజల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి మెల్లగా వ్యాపిస్తోంది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ముద్ర పాలనపై ఇంకా పడలేదు. ఎందుకంటే కాంగ్రెస్ 15 నెలల పాలనలో ఏం జరిగిందో చెప్పడానికి పెద్దగా ఏమీ లేదు. కనీసం రేషన్ కార్డుల సంస్కరణలు జరగేలదు. కిలో బియ్యం ధరలను పెంచలేదు. ఖర్చులను తగ్గించుకోవడం లేదు. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రజలను ఎంతోకాలం నమ్మించలేమని కాంగ్రెస్ నేతలు తెలుసుకుంటే మంచిది. బిసి కులగణన లాంటిది హడావిడిగా అమలు చేయడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం అభాసుపాలవుతోంది. రైతురుణ మాఫీ వల్ల లాభం కన్నా విమర్శలే ఎక్కువగా ఉన్నాయి.

# పెట్టుబడిదారీ విధానం నుండి పుట్టే అమానవీయత

అతి ఉత్తమమైన పెట్టుబడిదారీ వ్యవస్థ కన్నా, అతి చెత్తదైన సోషలిస్టు వ్యవస్థ కూడా మెరుగ్గా ఉంటుంది’ అని ప్రముఖ మార్క్సిస్టు తత్వవేత్త జార్జి లూకాక్స్ ఒక సందర్భంలో అన్నాడు. 1969లో ఒకసారి, మళ్లీ 1971లో రెండోసారి అతడు ఈ వ్యాఖ్య చేశాడు. అప్పటికి సోవియట్ యూనియన్‌లో, తూర్పు యూరప్ దేశాల్లో అమలులో ఉన్న సోషలిజం గురించి అతనికి సన్నిహితంగా తెలుసు. పశ్చిమ దేశాల్లోని వామపక్ష బృందాలు ఈ వ్యాఖ్యపై ఒకింత ప్రతికూలంగానే స్పందించాయి. కాని ఇటీవల అమెరికా నుండి భారత దేశానికి వెళ్లగొట్టిన పౌరులను, ముఖ్యంగా మహిళలను, చిన్న పిల్లలను, కాళ్లకు, చేతులకు బేడీలతో, సైనిక విమానాల నుండి దిగుతుండగా చూసినవారికి ఆనాడు లూకాక్స్ అన్నది తప్పకుండా గుర్తుకు వస్తుంది. కనీసం రెండు విషయాల్లో ఆనాటి సోవియట్ యూనియన్ గాని, తూర్పు యూరప్ దేశాలు కాని ఈనాటి ఏ పెట్టుబడిదారీ దేశం కన్నా చాలా మెరుగైన స్థాయిలో ఉన్నాయి.

**మొదటిది:** అగ్రగామిగా ఉన్న పెట్టుబడిదారీ దేశం అమెరికా తన దేశం నుండి ప్రజలను వెళ్లగొట్టడం వెనుక కనిపించే జాతి విద్వేషం సోషలిస్టు దేశాల్లో అధికారికంగా మచ్చుకైనా కనిపించేది కాదు. దానర్థం సోవియట్ యూనియన్‌లో అప్పుడు ప్రజల మధ్య ఏ జాతి విభేదాలూ లేవని కాదు. వారి మధ్య అక్కడక్కడా పొడచూపిన జాతి విద్వేష భావాలు, అక్కడ సోషలిజం కుప్పకూలిన సందర్భంలో బాహాటంగా వెల్లడయ్యాయి. సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లోని అభ్యుదయ వాదులు ఈ మధ్యకాలంలో జాతి విద్వేషాలు లేని వాతావరణం కోసం చేసిన ప్రయత్నాలు మనకు తెలుసు. అమెరికన్ సమాజానికి జాతి విద్వేషం లేదని, ఇప్పుడు వ్యక్తమైన జాతివ్యతిరేక ధోరణి ట్రంప్ వల్ల, అంటే ఇప్పుడు అధికారంలో ఉన్న నయా ఫాసిస్టు మూక వలన వచ్చిందే తప్ప మరొకటి కాదని చాలామంది భావించవచ్చు కూడా.

ట్రంప్ చేసేదంతా పెట్టుబడిదారీ విధానమేనని అనవలసిన పని లేదు. కాని, పెట్టుబడిదారీ విధానంతో



నిమిత్తం లేని ఒక ధోరణిగా ట్రంప్ వైఖరిని చూడడం తప్పు. ఆధునిక కాలంలో జాతి దురహంకారం అనేది సామ్రాజ్యవాదం నుండే ఉత్పన్నమైంది. ఇక సామ్రాజ్యవాదం అనేది లేని పెట్టుబడిదారీ వ్యవస్థను ఇప్పుడు ఊహించడం కూడా అసాధ్యం. పెట్టుబడిదారీ విధానంలోని అభ్యు దయ వాదులు కూడా సామ్రాజ్యవాదాన్ని కాలం చెల్లిన ఒక దోపిడీ విధానంగా, తిరస్కరించాల్సిన విధానంగా పరిగణించరు. అది అభివృద్ధికి దూరంగా ఉండిపోయిన వ్యవస్థలకు ఆధునిక తలను, ప్రగతిని తీసుకువచ్చే ఒక విధానమని వారు భావిస్తారు. సామ్రాజ్యవాదమే గనుక లేకుంటే అటువంటి వెనుకబడిన వ్యవస్థలు తమంతట తాముగా అభివృద్ధిని సాధించలేవని, సామ్రాజ్యవాదం వలన ఆ వ్యవస్థలకు ఏ కీడూ జరగదని, సామ్రాజ్యవాదాన్ని విస్తరింపజేసే వారు ఒక ఉన్నత జాతికి చెందిన మానవులవడం మూలంగానే వారు ఈ విధంగా తక్కినవారిని ఉద్ధరించగలుగుతున్నారనే అభిప్రాయం అందులో అంతర్లీనంగా ఉంది. నేటి సంపన్న దేశాల్లోని అభ్యుదయ వాదుల ఉద్దేశ్యాలు ఎంత మంచివైనప్పటికీ, వారు సామ్రాజ్యవాదాన్ని గనుక తిరస్కరించక పోతే, జాతి విద్వేషానికి తాము అతీతంగా ఉన్నట్టు వారు చెప్పుకోజాలరు. ఇటీవల జరిగిన రెండు యుద్ధాలకూ లభించిన విశాల మద్దతును చూస్తే ఈ ‘అభ్యుదయ’ శక్తులు సామ్రాజ్యవాదాన్ని తిరస్కరించరని స్పష్టమవుతోంది. ఆ రెండు యుద్ధాల్లో ఒకటి ఏకంగా ఒక జాతినే నిర్మూలించే లక్ష్యంతో జరిగితే, రెండవది పశ్చిమ దేశాల సామ్రాజ్యవాద విస్తరణ లక్ష్యంతో జరుగుతోంది.

అంటే జాత్యహంకారం అనేది సంపన్న పెట్టుబడిదారీ దేశలలో అంతర్లీనంగా కొనసాగుతోందని, ఏదో అక్కడక్కడా వ్యక్తమయ్యే వ్యతిరేకత మాదిరిగా కాకుండా, పాలక వర్గాల్లో, ఉదారవాదులతో సహా ఉన్నత స్థాయిలో సైతం వ్యక్తం అవుతోందని గమనించాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో కూరుకున్నప్పుడు ఈ జాత్యహంకారానికి ఒక కొత్త ఊపు వస్తుంది. గుత్త పెట్టుబడి కొందరు నిస్సహాయులైన వలసదారులను ”పరాయివారు”గా గుర్తించి వారి కారణంగానే తమ ఆధిపత్యం దెబ్బతింటోందన్నట్టు చిత్రిస్తాయి. నిజానికి ఇదంతా కార్మికవర్గాన్ని చీలగొట్టేందుకే ఉద్దేశించిన ఎత్తుగడ. సోషలిస్టు సమాజాలు ఇందుకు పూర్తి భిన్నం. అవి జాత్యహంకారానికి పూర్తి వ్యతిరేకంగా ఉండడమే గాక ఎప్పుడైనా తమ దేశాల్లో జాతి విద్వేష ధోరణులు తలెత్తితే వాటిని బలంగా అణచివేశాయి. ఇలా అణచి వేయడం అన్యాయం అని ఎవరైనా వాదించవచ్చు. అది న్యాయమో, అన్యాయమో పక్కనపెడితే అది ఎట్టి పరిస్థితి లోనూ ట్రంప్ మాదిరిగా జాతి విద్వేషాన్ని వ్యక్తం చేసే దశను తలెత్తనివ్వలేదు.

ఇక సోషలిస్టు దేశాలు సంపన్న పెట్టుబడిదారీ దేశాలతో పోల్చితే మెరుగైన ధోరణిని వ్యక్తం చేసిన రెండో అంశం పూర్తి స్థాయిలో ఉపాధిని కల్పించడం. నిరుద్యోగం ఉన్నప్పుడు వెలుపల నుండి వలసలు వచ్చినవారి పట్ల ద్వేషం కలిగే అవకాశం ఉంటుంది. ఆ నిరుద్యోగమే లేకపోతే ద్వేషం కలిగేందుకు ప్రాతిపదికే ఉండదు. సంపన్న పెట్టు బడిదారీ దేశాల్లో నిరుద్యోగం పెరుగుతున్నందువల్లే వలసదారుల పట్ల విద్వేషాన్ని రాజేయడానికి భూమిక ఏర్పడింది.

# సరిహద్దులో మరోసారి బరితెగించిన పాక్..
# దీటైన సమాధానం ఇచ్చిన భారత సైన్యం!





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ.......

జమ్మూ కాశ్మీర్ సరిహద్దు ప్రాంతంలో పాకిస్తాన్ మరోసారి బరి తెగించింది. ఎల్‌వోసీ వద్ద కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ వెంబడి భారత పోస్టుపై పాకిస్తాన్ దళాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో భద్రతా సిబ్బంది ఎవరూ గాయపడలేదని, కాల్పులకు తగిన సమాధానం ఇచ్చామని భారత సైన్యం తెలిపింది.జమ్మూ కాశ్మీర్ సరిహద్దు ప్రాంతంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి తెగబడింది.అయితే ఈ కాల్పులను సమర్థవంతంగా తిప్పికొట్టినట్లు భారత ఆర్మీ అధికారులు ప్రకటించారు.గుల్పూర్ సెక్టార్‌లోని భారత ఆర్మీ పోస్ట్‌పై నియంత్రణ రేఖ వెంబడి అటవీ ప్రాంతం నుంచి కాల్పులు జరిగాయి. పాకిస్తాన్ దాడిలో, దాదాపు 18 రౌండ్ల చిన్న ఆయుధాలతో కాల్పులు జరిగాయి. పాకిస్తాన్ కాల్పులకు ప్రతిగా భారత సైన్యం 60 రౌండ్లు కాల్పులు జరిపింది.ఆ తర్వాత భారత సైన్యం సున్నితమైన సరిహద్దు ప్రాంతంలో నిఘాను కఠినతరం చేసింది. ఈ క్రమంలో కవ్వింపు చర్యలకు పాల్పడ్డ పాకిస్థాన్‌కు భారత సైన్యం సరియైన బుద్ధి చెబుతోంది.ఈ కాల్పుల వెనుక పాకిస్తాన్ సైన్యం హస్తం ఉందా లేదా అడవిలో దాక్కున్న ఉగ్రవాదులు చొరబడటానికి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా అనేది ఇంకా స్పష్టంగా తెలియదని భారత ఆర్మీ అధికారులు తెలిపారు. ఫిబ్రవరి నెల ప్రారంభంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి భద్రతా సమీక్ష సమావేశం తర్వాత, ఎల్‌ఓసి వెంబడి, లోతట్టు ప్రాంతాలలో సైన్యం గస్తీని భద్రతా దళాలు ముమ్మరం చేశాయి. జమ్మూ కాశ్మీర్‌లో భద్రతా దళాలు చొరబాట్లకు తావు లేకుండా చూసుకోవాలని, ఉగ్రవాదుల పట్ల ఎలాంటి సహనం లేకుండా చూసుకోవాలని హోంమంత్రి ఆదేశించారు.

# సివిల్ సర్వీస్ అధికారులు
# ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి

**-సీఎం రేవంత్ రెడ్డి**




తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

సమస్యలను పరిష్కరించడంలో సివిల్ సర్వీస్ అధికారులు ప్రజలకు ఉపయోగపడే విధంగా సానుకూల దృక్పథం కలిగి ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు అన్నారు. పేదలకు సహాయం చేయాలన్న ఆలోచన ఉన్న అధికారులు ప్రజల మనసుల్లో ఎక్కువ కాలం గుర్తుంటారని చెప్పారు.ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం. గోపాలకృష్ణ గారు రాసిన 'లైఫ్ ఆఫ్ ఏ కర్మ యోగి' (Life of a Karma Yogi) పుస్తకాన్ని ముఖ్యమంత్రి గారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..."గతంలో ఐఏఎస్ అధికారులు నిత్యం ప్రజల్లో ఉండేవారు. ఆ కారణంగానే రాజకీయ నాయకుల కంటే అధికారులనే ప్రజలు ఎక్కువగా గుర్తుంచుకునే వారు. ముఖ్యంగా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించడం వల్ల సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. కానీ కొందరు కలెక్టర్లు ఏసీ రూములను వదిలి బయటకు వెళ్లడం లేదు. కలెక్టర్లు, ఎస్పీలకు జిల్లా స్థాయిలో గడించే అనుభవమే కీలకమవుతుంది.అధికారుల్లో మార్పు రావలసిన అవసరం ఉంది. నిబద్ధత కలిగిన అధికారులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది. రాజకీయ నాయకులు నిర్ణయాలు చేసినప్పుడు వాటిలోని అంశాలను విశ్లేషించి వివరించాల్సిన బాధ్యత సివిల్ సర్వీసెస్ అధికారులదే. బిజినెస్ రూల్స్ వివరించాలి. కొందరు వాటిని విస్మరిస్తున్నారు. అది సమాజానికి మంచిది కాదు. అధికారుల ఆలోచనా విధానాల్లో మార్పు రావాలి.ఎంతో నిబద్ధతతో పనిచేసిన గొప్ప అధికారి శంకరన్ గారు, పారదర్శక ఎన్నికల నిర్వహణకు ఎంతో కృషి చేసిన గొప్ప వ్యక్తి శేషన్ గారు, దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపిన వ్యక్తి మన్మోహన్ సింగ్ లాంటి వారి అనుభవాల నుంచి కొత్తగా సర్వీసులో చేరుతున్న సివిల్ సర్వెంట్స్ ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. ఆరు దశాబ్దాల అనుభవాన్ని ఈ పుస్తకంలో నిక్షిప్తం చేశారు. మనం ఏదైనా కొనొచ్చు. కానీ అనుభవాన్ని కొనలేం. సివిల్ సర్వెంట్స్ అందరికీ గోపాలకృష్ణ గారి పుస్తకం వెలకట్టలేనిది. అందరికీ ఒక దిక్సూచిగా ఉంటుంది. తొలి ప్రధానమంత్రి నెహ్రూ గారి కాలం నుంచి నేటి ప్రధాని మోదీ గారి వరకు అనుభవం కలిగిన గోపాలకృష్ణ గారు.. క్లోజ్డ్ ఎకానమీ నుంచి ఓపెన్ ఎకానమీ వరకు దేశంలో మార్పులకు ప్రత్యక్ష సాక్షి. భవిష్యత్తును కూడా వారు విజువలైజ్ చేయగలుగుతున్నారు" అని వివరించారు.ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారు, అసోసియేషన్ వైస్-ప్రెసిడెంట్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణరావు గారితో పాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# మెదక్,ఆదిలాబాద్. నిజామాబాద్.కరీంనగర్. పట్టభద్రుల
# ఎమ్మెల్సీ అభ్యర్థిగా అబ్బ గోని అశోక్ గౌడ్ ను గెలిపించండి

నిజామాబాద్ ప్రజాస్వేచ్ఛ



మెదక్ నిజాంబాద్ కరీంనగర్ అదిలాబాద్ పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలంగాణ ఉద్యమ నాయకుడు బీసీ ఉద్యమ నాయకుడు, నిరుద్యోగుల కోసం నిరంతరం పోరాడే వ్యక్తి అబ్బగోని అశోక్ గౌడ్ ని ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం సభ్యులు తెలియజేశారు.

ఈ సందర్భంగా తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నిజాంబాద్ జిల్లా స్పోక్స్ పర్సన్ (అధికార ప్రతినిధి) సూరి నీడ భాస్కర్ మాట్లాడుతూ.. అగ్రవర్ణాల పార్టీలు బిజెపి మరియు కాంగ్రెస్ రెండు పార్టీలు కూడా అగ్రవర్ణాలకు చెందినటువంటి అంజిరెడ్డి ప్రముఖ వ్యాపారవేత్త , అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి గార్లు ఎన్నడూ కూడా నిరుద్యోగుల పక్షాన గాని బీసీల పక్షాన గాని మాట్లాడిన దాఖలాలు లేవని ప్రశ్నించారు. అదేవిధంగా ప్రసన్న హరికృష్ణ కాంగ్రెస్ పార్టీ ఆశావాహి అందులో పార్టీ టికెట్ రాకపోవడం వల్ల బీఎస్పీ నుంచి పోటీ చేయడం జరుగుతుందని ప్రసన్న హరికృష్ణ ఎన్నడూ కూడా బీఎస్పీ పార్టీ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని ప్రకటించకపోవడం పట్ల బీసీ నాయకులు ఆలోచించాలని సూర్యని భాస్కర్ ఒకవేళ ప్రసన్న హరికృష్ణ గెలిస్తే ఖచ్చితంగా అగ్రవర్ణాల పాటులకు వెలుగుతారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.బీసీలకు సముచిత న్యాయం జరగాలంటే కేవలం మన బీసీ నాయకులను గెలిపించుకోవాలని అందులో భాగంగా అబ్బగోని అశోక్ గౌడ్ స్వతంత్ర అభ్యర్థిగా బీసీల కోసం పూర్తిస్థాయిగా ఎన్నో ఉద్యమాలు చేపట్టారని అంకిత భావంతో పని చేశారని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి సూరినిడ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞాపకార్థంగా పాపయ్య పేట పాఠశాల విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ...



వరంగల్ జిల్లా: ప్రజాస్వేచ్ఛ

గాదెగొని సదయ్య జ్ఞాపకార్థము వారి కుమారుడు రాజు చెన్నారావుపేట,ప్రాథమిక పాఠశాల పాపయ్యపేట విద్యార్థులకు భోజనం చేయుటకు ప్లేట్ల పంపిణీ చేయడం జరిగినది పాఠశాల ప్రధానోపాధ్యాయులు పత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు వాళ్ళ తండ్రిగారు పేరుమీద ప్లేట్లు ఉచితంగా ఇవ్వడం జరిగింది సమాజ సేవలో పాల్గొనడం సంతోషం అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కుమారస్వామి,శాంతా మేరీ పాల్గొనడం జరిగింది.

## బొగ్గుల సాయి కృష్ణ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం





ప్రజాస్వేచ్ఛ గోదావరిఖని

మాజీ ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ పుట్టినరోజ ను పురస్కరించుకొని ఈరోజు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం 1&3 ఇంక్లైన్ ఫిట్ సెక్రటరీ బొగ్గుల సాయి కృష్ణ ఆధ్వర్యంలో కార్మికులకు స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది అనంతరం అనాథ అభాగ్యులైన నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు

## నేడు మిర్చి మద్దతు ధర కోసం రైతులు మహాధర్నా.

**-తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు.**




వైరా ప్రజాస్వేచ్ఛ

మిర్చి క్వింటాలకు 25వేల రూపాయలు ధర నిర్ణయించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వద్ద తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు మహాధర్నా జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వైరా పటల అధ్యక్షులు మల్లంపాటి రామారావు కార్యదర్శి చింత నిప్పు చలపతిరావు కోరారు. సోమవారం వైరా బోడెపూడి వెంకటేశ్వరరావు భవన్ లో జరిగిన సమావేశంలో రాంబాబు, రామారావు, చలపతిరావు మాట్లాడుతూ మిర్చి రైతులు సరైన ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారు అని అన్నారు . ఎకరాకు రెండు లక్షల రూపాయల పైన పెట్టుబడి పెట్టి మిర్చి పంట పండిస్తే రైతులకు కన్నీళ్లు ఆత్మహత్యలు మిగులుతున్నాయి అని అన్నారు. ఎరువులు పైన ఐదు శాతం పురుగుమందుల పైన 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్న ప్రభుత్వాలు ఆపదలో ఉన్న రైతులకు మద్దతు ధర ఇవ్వటం లేదు అని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నాఫేడ్ మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 18 మంగళవారం ఉదయం 8:30 గంటలకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వద్ద రైతుల మహా ధర్నా జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బొంతు సమత, దొడ్డపునేని కృష్ణార్జునరావ్, నారి కొండ అమరేంద్ర, వడ్లమూడి బాబు, పసంగులపాటి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం అధ్యక్షులు నల్లగాసు విజయ్ జన్మదిన వేడుకలు

ప్రజాస్వేచ్ఛ



సిరందాసు వెంకటేశ్వర్లు దేవరకొండ జిల్లా నల్గొండ దేవరకొండ మాజీ ఎంపీపీ నల్లగాసు జానీ యాదవ్ కుమారుడు, దేవరకొండ పట్టణ యాదవ సంఘం అధ్యక్షులు నల్లగాసు విజయ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చింతకుంట్ల రాకేష్, చింతపల్లి మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆవుల రమేష్ . తదితరులు పాల్గొన్నారు

# తడక జగదీశ్వర్ గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు

## – గాంధీ ఆసుపత్రి దగ్గర అన్నదాన కార్యక్రమం





ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 17 గ్రేటర్ హైదరాబాద్ ప్రతినిధి
వైఎస్ఆర్‌సీపీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు,ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్‌గుప్తా ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ఎదుట సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మా రాజకీయ గురువు గౌరవనీయులు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర రావు 71పుట్టినరోజు పురష్కరించుకుని సుమారు వెయ్యి మంది నిరుపేదలు, అన్నార్తులు,అభాగ్యులకు చికెన్ బిర్యాని తో అన్నదానం చేసినట్లు జగదీశ్వర్‌గుప్తా తెలిపారు టిఆర్ఎస్ పార్టీ స్థాపించి వేలాది మందికి రాజకీయంగా ఎదుగుదలకు అవకాశం కల్పించారని, కెసిఆర్ మరి ఎన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆ దేవదేవుడు కలియు వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని భగవంతుని కోరుకుంటూ కెసిఆర్ తో తనకున్న అనుబంధాన్ని, అనుభవాలను గుర్తు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో కే సి ఆర్ అభిమానుల తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# రవి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు

ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 17 శేరి లింగంపల్లి
శేరిలింగంపల్లి బీఆర్ఎస్ స్థానిక నేత మారబోయిన రవి యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు
ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ రాజ్యసభ సభ్యులు, గ్రీన్ ఇండియా చాలెంజ్ ఫౌండర్ జోగినపల్లి సంతోష్ కుమార్ కి ఘనస్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు ఈ సందర్భంగా హరితసేన, గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి మజీద్ బండ ప్రభుత్వ పాఠశాలలో వృక్షార్చన కార్యక్రమంలో బాగంగా స్కూల్ విద్యార్థులతో కలిసి సంతోష్ కుమార్ మొక్కలు నాటారు..వృక్షార్చన కార్యక్రమం అనంతరం స్కూల్ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.
అనంతరం శేరిలింగంపల్లి స్థానిక బీఆర్ఎస్ నేత రవి యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన





వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొమిరి శెట్టి సాయిబాబా, మాజీ బిసి కమిషన్ మెంబర్ కిషోర్ గౌడ్,గ్రీన్ ఇండియా చాలెంజ్ కో ఫౌండర్ రాఘవ, సుబ్బరాజు, పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు మహిళ కార్యకర్తలు కే ఎన్ రామాలు, డాక్టర్.రవి కుమార్ , గడ్డం శ్రీనివాస్ , శ్రీకాంత్ యాదవ్ , పావని గౌడ్, రామ దేవి, ఆశ మరోజ్, స్వరూప, సుజాత, నిరూప, దివ్య, ఆర్.అరుణ, అనిత రట్టి, నాగమణి, రాజమణి, శోభ, బి.పావని గౌడ్, సుజాత , సాయి నందన్ , అనిల్ యాదవ్, శివ యాదవ్, నర్సింహా రెడ్డి , ప్రవీణ్ యాదవ్, సతీష్ యాదవ్ , శ్రీశైలం యాదవ్, బయ్య మలేష్ గౌడ్ , నవీన్ గౌడ్ , స్వామి ముదిరాజ్ , శివాజీ, మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

## పుట్టు చీర కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి గారు



వనపర్తి. ప్రజా స్వేచ్ఛ 17. ప్రతినిధి. వనపర్తి.
వనపర్తి నియోజకవర్గ యువ నాయకుడు, స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి, వనపర్తి పట్టణ కేంద్రంలో ఎస్ ఎల్ వి పంక్షన్ హాల్ లో సుమన్ రెడ్డి & కల్పన ల కూతుర్లు యశస్విని, సహస్ర ల పుట్టు చీర కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి. వనపర్తి నియోజకవర్గ యువ నాయకుడు, ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి హాజరై యశస్విని, సహస్ర లను అక్షింతలు వేసి దీవించారు. కార్యక్రమంలో గోపాల్ పేట్ నాయకులు జిల్లెల ప్రవీణ్ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ బాబా, అబ్దుల్లా, స్టేట్ యూత్ కాంగ్రెస్ నాయకుడు రవి కిరణ్, విజయబాబు, వెంకటేష్, పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ సీఎం కెసిఆర్ 71 పుట్టినరోజు వేడుకలు

ఫిబ్రవరి 18 గంభీరావు పేటప్రజా స్వేచ్ఛ
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని గోరంట్యాల గ్రామంలోని సాయిబాబా మందిరం లో తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన తెలంగాణ పోరాట యోధుడు తెలంగాణ రాష్ట్ర సాధకుడు తెలంగాణ తొలి మాజీ ముఖ్యమంత్రి జయంతి సందర్భంగా నాస్కాబ్ (ముంబాయి)చైర్మన్ మరియు ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహకార సంఘ అధ్యక్షులు కొండూరు రవీందర్ రావు గారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బర్త్ డే గిఫ్ట్ గామొక్కను నాటడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొమిరిశెట్టి విజయ లక్ష్మణ్ రోజు భాస్కర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 17 రామన్నపేట ప్రతినిధి
తెలంగాణ జాతిపిత ఉద్యమ రథసారథి టిఆర్ఎస్ పార్టీ అధినేత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదినాన్ని పురస్కరించుకొని రామన్నపేట మండల కేంద్రంలో సుభాష్ సెంటర్ వద్ద టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయడం జరిగింది అనంతరం ఏరియా ఆసుపత్రిలో పేషెంట్ల అందరికీ పండ్లు పంపిణీ చేయడం జరిగింది అదేవిధంగా చంద్రశేఖర రావు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతున్ని కోరుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లు బందెల రాములు కంభంపాటి శ్రీనివాస్ రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్ వేమవరం సుధీర్ బాబు బాలగోని నరసింహ ఎండి అమీర్ మాజీ సర్పంచులు రేఖ యాదయ్య బందెల యాదయ్య జిల్లా నాయకులు బద్దుల రమేష్ ఎస్కే చాంద్ పట్టణ కార్యదర్శి జాడ సంతోష్ నాయకులు బత్తుల వెంకన్న కూనూరు ముత్తయ్య మిర్యాల మల్లేశం లవణం రాము బాలగోని శివ రామిని లక్ష్మణ్ బొడ్డు అల్లయ్య ఎండి అజాస్ పెద్ద బోయిన మురళి జంగిలి నరసింహ ఆవుల శ్రీధర్ జాల అమరేందర్ రెడ్డి వివిధ గ్రామాల అధ్యక్షులు బండ శ్రీనివాస్ రెడ్డి మామిళ్ల అశోక్ గర్దాస్ విక్రమ్ గుండాల రాంబాబు పున్న వెంకటేశం ముక్కామల నరేందర్ మామిళ్ళ కుమార్ రాస వెంకటేశ్వర్లు కంచి నరసింహ గర్దాస్ కరుణాకర్ బొడ్డుపల్లి రాజు గోదాస్ ప్రవీణ్ బొలుగుల కృష్ణ నక్క నరేందర్ నల్ల సైదులు కడారి శివ లవణం ఉపేందర్ వర్కల రమేష్ గట్టు శేఖర్ ఎండి మోసబ్ చెరుకు ఉపేందర్ ఎండి అంజద్ పావిరాల నరసింహ కళ్లెం స్వామి గణేష్ సాయి వినయ్ వెంకటేశం మల్లయ్య శ్రీను తదితరులు పాల్గొన్నారు

## మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 17 ఘట్కేసర్ ప్రతినిధి
మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించి పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు ఈ కార్యక్రమంలో పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొంతం శంకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ నాయక్, బాలు నాయక్ పోచారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ లో చిన్నకాపర్తి వాసి రూపని వెంకన్న అనుమానాస్పద మృతి

### –కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 17 ఘట్కేసర్ ప్రతినిధి
మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి కొండాపూర్ సమీపంలో రూపని వెంకన్న తండ్రి సాయిలు వయసు 49 సంవత్సరములు అనే వ్యక్తి అనుమానస్పద మృతి చెందారని మృతుని భార్య ఘట్కేసర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు వివరాల్లోకి వెళితే మృతుడు రూపుని వెంకన్న నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన వ్యక్తి పని నిమిత్తం రెండు రోజుల క్రితం శామీర్పేట మండలం మేడ్చల్ జిల్లా రావటం జరిగిందని అక్కడ పని దొరకకపోవడంతో నిన్న తేదీ 16-02-2025 ఆదివారం రోజు తన భార్యకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నట్టు తెలియపరిచారు తేదీ 17 సోమవారం రోజున సుమారు మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో బైకు పై సొంత గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో బైక్ ఏపీ 28 బిహెచ్ 3401 పక్కన పెట్టి ఒక కల్వర్టు వద్ద పడిపోయి చనిపోయి ఉన్నాడు చిన్న గాయం ఉన్నది మృతునికి గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలు ఉండటం లేదా మరే ఇతర కారణాల వలన చనిపోయి ఉండవచ్చని పూర్తి వివరాలు విచారణలో పోస్టుమార్టం అనంతరం తెలుస్తాయని ఫిర్యాదు తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్టుగా ఘట్కేసర్ పోలీసు వారు మీడియాకు తెలియపరిచారు


## అలుపెరగని పోరాట యోధుడు ని కలిసిన శివశంకర్ మాదిగ



ఘనపూర్. ప్రజా స్వేచ్ఛ 17. ప్రతినిధి. వనపర్తి.
దళిత జాతి చిరకాల ఆకాంక్ష వర్గీకరణ సమస్యను సాధించిన పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ ని మర్యాద పూర్వకంగా కలిసి మాదిగ జాతి తరుపున ధన్యవాదాలు తెలపిన వనపర్తి జిల్లా బిజెపి దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి శివశంకర్ మాదిగ. ఈ సందర్భంగా మాట్లాడుతు, మంద కృష్ణ మాదిగ గారు మాట్లాడుతూ, మాదిగ యువత రాజకీయాలలో వచ్చి జాతికి ప్రాతినిధ్యం వహించి జాతి గర్వపడే విధంగా ఎదగాలి అని ఆకాక్షించారు.

# బిజినెస్

## ఎనిమిది రోజుల నష్టాలకు బ్రేక్.. స్వల్ప లాభాల్లో ముగిసిన మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు ఎనిమిది రోజుల నష్టాలకు ఎట్టకేలకు బ్రేక్ పడింది. సోమవారం సెషన్‌లో మార్కెట్లు స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఫార్మా, మెటల్, ఫైనాన్షియల్ రంగాల్లో మద్దతుతో సూచీలు లాభపడ్డాయి. గ్లోబల్ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల మధ్య సూచీలు ఉదయం బలహీనంగా ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత కొద్దిసేపటికే అమ్మకాల ఒత్తిడికి గురయ్యారు. పెరుగుతూ.. పడిపోతూ.. ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి. చివరకు స్వల్ప లాభాలతో బయటపడ్డాయి. సెన్సెక్స్ క్రితం సెషన్‌తో పోలిస్తే.. సోమవారం ఉదయం 75,641.41 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలయ్యాయి. ఇంట్రాడేలో 75,294.76 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 76,041.96 పాయింట్లకు పెరిగింది. చివరకు 57.65 పాయింట్ల లాభంతో 75,996.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 30.25 పాయింట్లు పెరిగి.. 22,959.50 వద్ద ముగిసింది.నిఫ్టీలో బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, పవర్ గ్రిడ్ కార్ప్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్ లాభాలను ఆర్జించాయి. ఎం అండ్ ఎం, భారతి ఎయిర్‌టెల్, విప్రో, టీసీఎస్, ఇన్ఫోసిస్ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం పెరగ్గా.. స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.6శాతం పడిపోయింది. ఆటో, ఐటీ, టెలికాం, మీడియా 0.5శాతం నుంచి ఒకశాతం వరకు పతనమయ్యాయి. ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్, ఎనర్జీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్ సూచీలు 0.5-1 శాతం పెరిగాయి. ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్, పవర్ గ్రిడ్, ఎస్‌బీఐ, హీరో మోటోకార్ప్, కోల్ ఇండియా, తాన్లా ప్లాట్‌ఫామ్స్, కిర్లోస్కర్ ఆయిల్, డేటా ప్యాటర్న్స్, కార్బోరండం, ఈఐహెచ్, రిలాక్సో ఫుట్‌వేర్, టాటా టెలిసర్వీసెస్, పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్, జ్యోతి ల్యాబ్స్, అనుపమ్ రసాయనన్, టిటాగర్ రైల్, థర్మాక్స్, ఎన్‌ఎండీసీ స్టీల్, షాపర్స్ స్టాప్, బాలాజీ అమైన్స్, గ్రాఫైట్ ఇండియా సహా 900 కంటే ఎక్కువ స్టాక్‌లు బీఎస్ఇలో 52 వారాల కనిష్ఠానికి చేరుకున్నాయి.

## తగ్గేదేలే.. మళ్లీ పెరిగిన బంగారం ధరలు.

పసిడి పరుగులు ఆగట్లేదు. ఊహించిన దానికంటే వేగంగా పరిగెడుతోంది. ఇటీవల తొలిసారి 89 వేల రూపాయల మార్కు తాకి, ఆల్ టైమ్ హైని టచ్ చేసింది గోల్డ్%ా% నేను మాత్రం తక్కువ తిన్నానా అన్నట్లు వెండి కూడా పరుగులు తీస్తోంది. వాస్తవానికి గత కొంతకాలం నుంచి బంగారం, వెండి ధరలు భారీగా పెరుగుతున్నాయి.. ధర తగ్గడం పదుల్లో ఉంటే.. పెరగడం మాత్రం వందల్లో ఉంటోంది.. అయితే.. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండికి ఎల్లప్పుడూ డిమాండే ఉంటుంది. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలు, పరిస్థితుల ప్రకారం.. పసిడి, వెండి ధరల్లో ప్రతిరోజూ మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి.. తాజాగా గోల్డ్ రేటు స్వల్పంగా పెరగగా.. సిల్వర్ ధర తగ్గింది.

పసిడి పరుగులు ఆగట్లేదు. ఊహించిన దానికంటే వేగంగా పరిగెడుతోంది. ఇటీవల తొలిసారి 89 వేల రూపాయల మార్కు తాకి, ఆల్ టైమ్ హైని టచ్ చేసింది గోల్డ్%ా% నేను మాత్రం తక్కువ తిన్నానా అన్నట్లు వెండి కూడా పరుగులు తీస్తోంది. వాస్తవానికి గత కొంతకాలం నుంచి బంగారం, వెండి ధరలు



భారీగా పెరుగుతున్నాయి.. ధర తగ్గడం పదుల్లో ఉంటే.. పెరగడం మాత్రం వందల్లో ఉంటోంది.. అయితే.. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండికి ఎల్లప్పుడూ డిమాండే ఉంటుంది. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలు, పరిస్థితుల ప్రకారం.. పసిడి, వెండి ధరల్లో ప్రతిరోజూ మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి.. తాజాగా గోల్డ్ రేటు స్వల్పంగా పెరగగా.. సిల్వర్ ధర తగ్గింది.సోమవారం (17 ఫిబ్రవరి 2025) ఉదయం ఆరు గంటల వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.78,890, 24 క్యారెట్ల బంగారం ధర రూ.86,060 గా ఉంది. వెండి కిలో ధర రూ. 100,400 గా ఉంది. 10గ్రాముల బంగారంపై రూ.10 మేర ధర పెరగగా.. వెండి కిలోపై రూ.100 మేర ధర తగ్గింది.

## ఆపిల్‌ను అధిగమించిన రిలయన్స్.
## ప్రపంచవ్యాప్తంగా రెండో స్థానం..

దేశంలోని ప్రముఖ వ్యాపార కంపెనీలలో రిలయన్స్ , అదానీ, టీసీఎస్, మహీంద్రా వంటి పలు సంస్థల పేర్లు అనేక సందర్భాల్లో వింటుంటాం. అయితే రిలయన్స్ ఇండస్ట్రీస్ మాత్రం ఈసారి అరుదైన ఘనతను దక్కించుకుంది. ఫ్యూచర్ బ్రాండ్ ఇండెక్స్ 2024లో చరిత్ర సృష్టించింది. ఈ సూచికలో ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీల్లో ఒకటైన ఆపిల్‌ను వెనక్కి నెట్టి, రిలయన్స్ రెండో స్థానం దక్కించుకుందిఒక భారతీయ కంపెనీ టాప్-3లో చోటు సంపాదించడం ఇదే





మొదటిసారి కావడం విశేషం. ఈ ర్యాంకింగ్‌లో రిలయన్స్ తన స్థానం 13 నుంచి ఏకంగా రెండో స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో ఆపిల్, నైక్, వాల్ట్ డిస్నీ, నెట్‌ఫ్లిక్స్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్ వంటి కీలక సంస్థలను వెనక్కి నెట్టి ముందుకెళ్లింది.

# స్పోర్ట్స్

## ఛాంపియన్స్ ట్రోఫీ భారత్ గెలుస్తుంది

ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకెల్ క్లార్క్

ఛాంపియన్స్ ట్రోఫీ 2025 టోర్నమెంట్?కు టీమ్‌ఇండియా సిద్ధం అవుతోంది. టోర్నీలో పాల్గొనేందుకు భారత్ క్రికెట్ జట్టు ఇప్పటికే దుబాయ్ చేరుకుంది. ఇప్పటికే ఆటగాళ్లంతా నెట్స్?లో ప్రాక్టీస్ మొదలు పెట్టేశారు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకెల్ క్లార్క్ టీమ్‌ఇండియాపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు.ఈసారి భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలుస్తుందని జోస్యం చెప్పాడు. అలాగే టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ టోర్నీలో టాప్? స్కోరర్?గా నిలుస్తాడని క్లార్క్ వ్యాఖ్యానించాడు. రోహిత్ ఒక్కసారి క్రీజులో కుదురుకుంటే అతడిని ఆపడం ఎవరి వల్లా కాదని అన్నాడు. రీసెంట్?గా ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో ఫామ్ అందుకోవడం టీమ్‌ఇండియాకు కలిసొచ్చే అంశమని స్పష్టం చేశాడు. 'ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్?ను భారతే గెలుచుకుంటుందని చెబుతున్నా. కెప్టెన్ రోహిత్ శర్మ మళ్లీ ఫామ్‌లోకి రావడం బాగుంది. అందుకే టీమ్‌ఇండియా టైటిల్ దక్కించుకోగలదని భావిస్తున్నా. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించే బ్యాటర్‌గానూ




నిలుస్తాడు. ఇక జోఫ్రా ఆర్చర్ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్? అవుతాడనుకుంటున్నా. జట్టు పరంగా ఇంగ్లాండ్‌కు టైటిల్ అవకాశాలు తక్కువే. కానీ, ఆ జట్టులో జోఫ్రానే సూపర్ స్టార్. ట్రావిస్ హెడ్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలుస్తాడని అనుకుంటున్నా. హెడ్? ఐపీఎల్ ఫామ్ కొనసాగిస్తాడని ఆశిస్తున్నా. గత వన్డే వరల్డ్?కప్?లోనూ అతడు కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు' అని క్లార్క్? పేర్కొన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగుతున్న విరాట్ కోహ్లీ ముంగిట ఓ రికార్డు ఉంది. విరాట్ మరో 263 పరుగులు చేస్తే, ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్?గా నిలుస్తాడు. ప్రస్తుతం ఈ రికార్డు వెస్టిండీస్ మాజీ ప్లేయర్, యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ పేరిట ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీలో గేల్ 791 పరుగులు చేసి టాప్?లో ఉన్నాడు. విరాట్ 13 మ్యాచ్?ల్లో 529 పరుగులు చేశాడు. జాబితాలో శిఖర్ ధావన్ (701 పరుగులు) మూడో స్థానంలో ఉన్నాడు.

## జియో, హాట్ స్టార్ లలో ఛాంపియన్స్ ట్రోఫీ

### ఉచితంగా మ్యాచ్‌లను వీక్షించే అవకాశం

ఛాంపియన్స్ ట్రోఫీ-2025 ప్రారంభానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ బుధవారం (ఫిబ్రవరి 19) ప్రారంభమై మార్చి 9 వరకు కొనసాగుతుంది. ఈ టోర్నమెంట్‌లో తొలి మ్యాచ్ పాకిస్తాన్ వర్సెస్ న్యూజిలాండ్ మధ్య జరగనుంది. ఇక ఫిబ్రవరి 20 నుంచి టీమిండియా మ్యాచ్ లు ప్రారంభం కానున్నాయి. ఈ మ్యాచ్‌లో టీం ఇండియా ప్రత్యర్థి బంగ్లాదేశ్. ఈ మ్యాచ్‌కు దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. ఇక భారత జట్టు తన రెండో మ్యాచ్ చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ తో ఆడనుంది. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ ఫిబ్రవరి 23న జరుగుతుంది. ఈ మ్యాచ్ కూడా దుబాయ్




ఇంటర్నేషనల్ స్టేడియంలోనే జరుగుతుంది. టీం ఇండియా తన చివరి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ మార్చి 2న దుబాయ్‌లో జరుగుతుంది. అంటే తొలి రౌండ్‌లో టీమిండియా దుబాయ్‌లో మూడు మ్యాచ్‌లు ఆడనుంది. దీని తర్వాత, టీం ఇండియా సెమీఫైనల్స్, ఫైనల్‌కు చేరుకుంటే మరో రెండు మ్యాచ్‌లు ఆడనుంది. కాగా ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లను ఈ సారి భారత్‌లో జియో, హాట్ స్టార్ నెట్?వర్క్ ప్రసారం చేయనున్నాయి. ఇందులో భాగంగానే టీవీల్లో స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ 18 ఛానెల్స్‌లో ప్రసారం కానున్నాయి. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, మరాఠీ, బెంగాలీ, భోజ్ పురి, తమిళం, కన్నడ వంటి 8 భాషల్లో ప్రసారం కానున్నాయి. స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ 18 ఛానెల్‌లలో హిందీ, తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో లైవ్ మ్యాచ్ లు చూడవచ్చు. ఇక డిజిటల్ స్ట్రీమింగ్ విషయానికి వస్తే.. ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచు లను జియోస్టార్‌లో వీక్షించవచ్చు. గతంలో జియో టీవీ, హాట్ స్టార్ యాప్స్ లలో ఉచితంగా మ్యాచ్‌లను వీక్షించే అవకాశం ఉండేది. అయితే ఇప్పుడు జియో, హాట్‌స్టార్ రెండూ కలిసి జియోస్టార్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచులను చూడాలంటే కచ్చితంగా సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సిందే. అంటే టీవీలో మాత్రమే మ్యాచ్‌లను ఉచితంగా వీక్షించవచ్చన్నమాట

## హార్ధిక్ పాండ్యాపై నిషేధం

-హార్ధిక్ పాండ్యా తొలి మ్యాచ్ కు దూరం

-ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ!?



ఐపీఎల్‌లో భారీ ఫ్యాన్ బేస్ ఉన్న టీమ్స్‌లో ముంబై ఇండియన్స్ కూడా ఒకటి. ముంబై తమ తొలి మ్యాచ్‌ను మార్చ్ 23న చెన్నై సూపర్ కింగ్స్‌తో చెన్నైలోని ఎంఏ చిదంబరం క్రికెట్ స్టేడియంలో ఆడనుంది. అయితే.. ఈ ఐపీఎల్ 2025 ప్రారంభం కాకముందే ముంబై ఇండియన్స్‌కు భారీ షాక్ తగిలింది. అదేంటంటే.. ఆ జట్టు కెప్టెన్ హార్ధిక్ పాండ్యాపై నిషేధం విధించారు. అతన్ని ఒక మ్యాచ్ ఆడకుండా బ్యాన్ చేశారు. ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ ఆడబోయే తొలి మ్యాచ్‌కు హార్ధిక్ పాండ్యా దూరం కానున్నాడు. అదేంటి ఇంకా సీజన్ స్టార్ట్ కాకుండానే నిషేధం ఏంటి? అసలు పాండ్యా ఏం తప్పు చేశాడని అనుకుంటున్నారా? గతేడాది అంటే 2024 ఐపీఎల్ సీజన్ సమయంలో హార్ధిక్ పాండ్యా చేసిన తప్పే ఇప్పుడు అతనిపై నిషేధానికి కారణం అయ్యింది. ఐపీఎల్ 2024 సందర్భంగా ముంబై గ్రూప్ స్టేజ్‌లోనే ఇంటి ముఖం పట్టిన విషయం తెలిసిందే. కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరలేదు. అయితే తమ చివరి గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌ను లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆడింది ముంబై ఇండియన్స్. ఆ మ్యాచ్‌లో ముంబై స్లో ఓవర్ రేట్‌ను నమోదు చేసింది. దీంతో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్ధిక్ పాండ్యా మ్యాచ్ ఫీజులో 30 శాతం, మిగతా ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 12 శాతం కోత విధించారు. అయితే ఈ స్లో ఓవర్ రేట్ అనేది ఆ సీజన్‌లో ముంబై ఇండియన్స్ మూడో సారి చేయడంతో ఆ జట్టు కెప్టెన్‌పై ఒక మ్యాచ్ నిషేధం విధించారు. అయితే.. అప్పటికే ముంబై ఇండియన్స్ ఆ సీజన్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడేయడంతో వచ్చే సీజన్ అంటే ఐపీఎల్ 2025 సీజన్ తొలి మ్యాచ్‌ను ఆడకుండా బ్యాన్ విధించారు ఐపీఎల్ నిర్వాహకులు. సో ఇలా హార్ధిక్ పాండ్యా ఐపీఎల్ 2025 ఫస్ట్ మ్యాచ్‌కే దూరం కానున్నాడు. మరి పాండ్యా లేకుంటే ముంబై ఇండియన్స్‌కి తొలి మ్యాచ్‌లో కెప్టెన్ ఎవరు వ్యవహరిస్తారనే డౌట్ రావొచ్చు. ముంబైని ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిపిన మాజీ కెప్టెన్ రోహిత్ శర్మకే ఆ బ్యాధతలు అప్పగిస్తారనే టాక్ ఉన్నప్పటికీ.. అందుకే రోహిత్ ఒప్పుకుంటాడా? లేదా? అన్నది కీలకం. ఇక జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ వీరిద్దరిలో ఒకరికి ఆ ఒక్క మ్యాచ్ కోసం కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే ఛాన్స్ ఎక్కువగా ఉంది. చూడాలి మరి ముంబై






# ఆ రోజు కోసం ఎదురుచూస్తున్నా సాయిపల్లవి

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన మనసులోని కోరికను బయటపెట్టేసింది సహజనటి సాయిపల్లవి. ఆమెకు జాతీయ అవార్డు అందుకోవాలని ఎంతో ఆశగా ఉందట. దానికి బలమైన కారణం కూడా ఉందట. ఆ విషయం గురించి ఆమె మాట్లాడుతూ 'పెళ్లప్పుడు కట్టుకోమని మా మామ్మ నాకు ఓ చీర ఇచ్చింది. అప్పుడు నాకు 21ఏళ్లు. అప్పటికింకా నేను సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వలేదు. అసలు ఆ ఆలోచనే లేదు. పెళ్లి చేసుకునేటప్పుడు కట్టుకుందామని ఆ చీర దాచుకున్నాను. కొనేళ్లకు అనుకోకుండా 'ప్రేమమ్'తో నటిని అయ్యాను. 'ఫిదా'తో మంచి పేరొచ్చింది. ఏదో ఒక రోజు తప్పకుండా ఒక ప్రతిష్ఠాత్మక అవార్డు కూడా అందుకుంటాననే నమ్మకం వచ్చింది. అందుకే.. జాతీయ అవార్డు అనేది నిజంగా నాకొస్తే.. అప్పుడు మా మామ్మ ఇచ్చిన చీర కట్టుకొని ఆ అవార్డు అందుకోవాలి అని నిశ్చయించుకున్నా. నిజంగా అవార్డు వచ్చినా, రాకపోయినా.. ఆ చీర ధరించే వరకూ ఆ ఒత్తిడి మాత్రం నన్ను వదలదు.' అంటూ చెప్పుకొచ్చింది సాయిపల్లవి. నిజానిక్కూడా ఈ దఫా సాయిపల్లవికి నేషనల్ అవార్డు పక్కా అని పలువురి అభిప్రాయం. 'అమరన్'లోని ఆమె నటనకు తప్పకుండా అవార్డు వస్తుందని చాలామంది నమ్ముతున్నారు. అదే జరిగితే సాయిపల్లవి ఒత్తిడీ తీరుతుంది. అభిమానుల ఆకాంక్షా నెరవేరుతుంది.

# సందీప్ కిషన్ మజాకా టీం క్రేజీ ప్లాన్..

## రావులమ్మ సాంగ్ లైవ్ ఫిల్మ్ షూట్ చూశారా..?

టాలీవుడ్ యాక్టర్ సందీప్ కిషన్ కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం మజాకా . ధమాకా ఫేం త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నాడు. పెళ్లి చూపులు ఫేం రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తుంది. రావు రమేశ్, మన్మథుడు ఫేం అన్షు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మాస్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రం ఫిబ్రవరి 21న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా ఉంది టీం. కాగా సందీప్ కిషన్ టీం తొలిసారి సరికొత్త ప్రయోగం చేస్తోంది. ఈ మూవీ నుంచి రావులమ్మ సాంగ్ లైవ్ ఫిల్మ్ షూట్ ఎలా ఉండబోతుందో తెలియజేసింది. సాంగ్ షూట్‌కు సంబంధించిన ఫుల్ వీడియోను షేర్ చేసింది. ఇండస్ట్రీలో తొలిసారి ఇలాంటి ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకొస్తూ.. సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదల చేసిన బ్యాచిలర్స్ ఆంథెమ్ సాంగ్‌తోపాటు మెలోడీ ట్రాక్ యే లైఫ్ అందామా? పాటలకు మంచి స్పందన వస్తోంది. మజాకా నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన టైటిల్, ఫస్ట్ లుక్‌లో సందీప్ కిషన్ పంచె కట్టులో కనిపిస్తూ సందడి చేస్తున్నాడు. ఆర్కే బీచ్‌లో మందుకొడుతున్న ఇద్దరినీ స్టేషన్‌కు తీసుకొచ్చాం సార్.. హీరోహీరోయిన్లు స్టేషన్‌లో ఉన్న సీన్లతో మొదలైన టీజర్‌లో.. అక్కడ పోసుకున్నది బీరు కాదండి.. నా ఉసురు అని సందీప్ కిషన్ అంటుంటే.. నాకు తెలియక అడుగుతున్నాను బీర్ బెటరా.. విస్కీ బెటరా అని అడుగుతోంది రీతూవర్మ. దీనికి రకుల్ బెటరా.. రెజీనా బెటరా అంటే ఏం చెప్తానండీ రీతూ వర్మ డైలాగ్స్ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఈ మూవీని ఏకే ఎంటర్ టైన్ మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

# రెడ్ చీరలో అదరగొడుతున్న దేత్తడి హారిక..



దేత్తడి హారిక.. ఈ చిన్నదాని గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. యూట్యూబ్ స్టార్ గా తెలుగు రాష్ట్రాల్లో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. తెలంగాణ యాసలో మాట్లాడుతూ.. యూట్యూబ్ లో అందరికీ ఇచ్చిపడేసే వీడియోలతో నెట్టింట బాగా పాపులర్ దేత్తడి హారిక. సోషల్ మీడియా ద్వారా వచ్చిన క్రేజ్ తో ఈ చిన్నది బిగ్ బాస్ గేమ్ షోలో అవకాశం అందుకుంది. నాగార్జున హోస్ట్ గా చేసిన బిగ్ బాస్ సీజన్ 4లో కంటెస్టెంట్ గా పాల్గొంది. హౌజ్‌లో తనదైన అల్లరి పనులతో టాప్ 5లో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంటులో కొన్ని ఫొటోస్ షేర్ చేసింది ఈ భామ. 9 సెప్టెంబర్ 1997న తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఓ హిందూ కుటుంబంలో జన్మించింది అందాల తార అలేఖ్య హారిక. ఈ బ్యూటీకి వంశీ కార్తీక్ అనే ఒక సోదరుడు కూడా ఉన్నాడు. సోషల్ మీడియాలో ఈ చిన్నదాన్ని ఫాలో అయ్యేవారి సంఖ్య ఎక్కువే.. హైదరాబాద్ లోని ఓ పాఠశాలలో స్కూలింగ్ విద్య పూర్తిచేసింది. మెహదీపట్నంలో ఉన్నసెయింట్ ఆన్స్ కళాశాల నుంచి బ్యాచలర్ అఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి డిగ్రీ పట్టా పొందింది ఈ వయ్యారి భామ. అలేఖ్యకు చిన్నప్పటి నుంచి డ్యాన్స్‌పై మక్కువ ఎక్కువ. చిన్నప్పటి నుంచి కొరియోగ్రాఫర్ కావాలని కోరిక. 2015లో ఆమె హైదరాబాద్‌లోని అమెజాన్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఎగ్జిక్యూటివ్‌గా చేరారు. అలేఖ్య దాదాపు మూడు సంవత్సరాలు అక్కడ పని చేసింది. ఆతర్వాత సోషల్ మీడియాలో పాపులర్ అయ్యింది. కొన్ని సినిమాల్లోనూ నటించింది. అలాగే ప్రైవేట్ ఆల్బమ్స్ లోనూ నటించింది దేత్తడి హారిక.

# మరో ఘనతను దక్కించుకున్న అలియాభట్



బాలీవుడ్ క్యూట్ బ్యూటీ అలియాభట్‌కు మరో ఘనత సాధించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిభావంతమైన హీరోయిన్ల జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్ హైప్ ఆడిటర్ తాజాగా విడుదల చేసిన నివేదికలో అలియా సెకెండ్ ప్లేస్ సొంతం చేసుకుంది. జెన్నిఫర్ లోపెజ్ వంటి అంతర్జాతీయ నాయికలను వెనక్కినెట్టి అలియా టాప్‌లో ఉండడం ప్రత్యేకత సంతరించుకుంది. ఈ సందర్భంగా అభిమానులు ఆమెను విష్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో అలియాకు ఉన్న ఫాలోయింగ్ గురించి తెలిసిందే! ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెను 8 కోట్ల మందికి పైగా ఫాలో అవుతున్నారు. ఎప్పుడూ తన సినిమా, వ్యక్తిగత విశేషాలను అలియా ఫ్యాన్స్‌తో పంచుకుంటుంటారు. ఫొటోషూట్‌లతో ఆకట్టుకుంటారు. గతేడాది కూడా టైమ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన '100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఆఫ్ 2024' జాబితాలోనూ చోటు దక్కించుకుంది అలియా. గత ఏడాది ఆమె 'జిగ్రా'తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ చిత్రం మిశ్రమ ఫలితాలకు పరిమితమైంది. తాజాగా అలియాకు సంబంధించిన వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రభాస్, హనురాఘవపూడి కాంబినేషన్‌లో రానున్న ఫౌజీ సినిమాలో అలియా యువరాణి పాత్రలో కనిపించనున్నట్లు టాక్ నడుస్తోంది. నాగ్ అశ్విన్ సినిమాలోనూ ఆమె నటించనున్నట్లు వారలు వస్తున్నాయి. ఈ వార్తలో ఎంత వరకు నిజం ఉంది అనేది అధికారిక ప్రకటన వస్తే తప్ప తెలియదు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492